ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
# ప్రజా కలం
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275
PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

గురువారం | 13-08- 2026 సంపుటి: 17, సంచిక: 131, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## మిల్లర్ల నుంచి బకాయిలు

# వసూలు చేయాల్సిందే..

## బకాయిల వసూలుకు విధివిధానాల రూపకల్పన

**ధాన్యం నిల్వకు అయిదు నియోజకవర్గాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలు**

**పౌరసరఫరాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**




హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాకలం) :

మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాల రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సీఎం సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు,

తరువాయి 2వ పేజీలో...



## తెలంగాణకు 11.56 లక్షల

# ఇళ్లు కేటాయించండి

**కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి వినతి**

**తెలంగాణలో పర్యటించాల్సిందిగా కేంద్ర మంత్రికి ఆహ్వానం**

**సానుకూలంగా స్పందించిన శివరాజ్ సింగ్ చౌహాన్.. రాష్ట్ర పర్యటనకు అంగీకారం**

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ (PMAY-G 2.0) కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా గుర్తుచేసిన ఆయన, రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడాది క్రితమే సర్వే పూర్తి.. మంజూరులోనే జాప్యం రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్–2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్



# అమిత్ షా వర్సెస్ రాహుల్!

**విద్యార్థులపై లాఠీచార్జికి చర్చకు సిద్ధం**

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

**లాఠీచార్జిపై సూటిగా సమాధానం కావాలి**

**కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ**



2

## కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్...

# ఓర్చుకోనుండాలోయ్ ఓటరా ??

- ప్రశ్నించాల్సిన వారు... ప్రశ్నించడం మరిచారా? - అధికారం కోసం ప్రజలు ఓట్లు వేయలేదు...
- తమ సమస్యలపై మాట్లాడే ప్రతినిధుల కోసం ఓట్లు వేశారు. - సమావేశాలకు కూడా హాజరు కాకపోతే,పాలన ఎలా సాగుతుంది?
- ప్రజా ప్రతినిధి నీ సమయం పైసలకా... పదవికా... ప్రజలకా?
- లేకపోతే రేపటి ఎన్నికల్లో "ఎవరికి ఓటేశాం?" అనే ప్రశ్న కంటే.. "ఎందుకు ఓటేశాం?" అనే ప్రశ్న??




2



## బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది విధుల్లో

# అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించాలి**

3

## ఎక్సైజ్ లాకప్‌లో

# భద్రత డొల్ల!




- హెరాయిన్ కేసు నిందితుడు గ్రిల్స్ విరగగొట్టి పరార్..
- ఎక్సైజ్ లాక్‌అప్..పటాన్‌చెరులో సంచలనం..
- ఖైదీని కాపాడాల్సిన లాక్‌అప్ నుంచే తప్పించుకున్నవైనం..
- ఎక్సైజ్ అధికారుల పని తీరుపై ప్రశ్నలు..



పటాన్‌చెరు, ఆగస్టు 12 (ప్రజా కలం ప్రతినిధి )

హెరాయిన్ విక్రయిస్తున్నాడనే ఆరోపణలతో ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్న సహిదూర్ రహమాన్ అనే నిందితుడు పటాన్‌చెరు ఎక్సైజ్ శాఖ స్టేషన్ లాక్‌అప్ నుంచి పరారైన ఘటన తీవ్ర కలకలం రేగుతుంది.. బుధవారం తెల్లవారుజామున లాక్‌అప్ గ్రిల్స్ విరగగొట్టి నిందితుడు తప్పించుకున్నట్లు అధికారులు గుర్తించారు. హెరాయిన్ విక్రయిస్తున్న సమయంలో సహిదూర్ రహమాన్‌ను ఎక్సైజ్ అధికారులు పట్టుకుని లాక్‌అప్‌లో ఉంచారు. అయితే అదుపులో ఉన్న నిందితుడు లాక్‌అప్ గ్రిల్స్ విరగగొట్టి పరారైనట్లు తెలుస్తోంది. దీంతో ఎక్సైజ్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా, పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**లాక్‌అప్ భద్రతపై తీవ్ర ప్రశ్నలు..**

నిందితుడు లాక్‌అప్ గ్రిల్స్ ను విరగగొట్టి తప్పించుకునే వరకు సిబ్బంది పర్యవేక్షణ ఎక్కడ ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.!. లాక్‌అప్‌లో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి.? నిందితుడు గ్రిల్స్ విరగగొట్టేందుకు అవసరమైన అవకాశం ఎలా లభించింది.? ఘటన సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది ఎవరు.? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది.

**పరారైన నిందితుడి కోసం గాలింపు..**

ఘటనపై ఎక్సైజ్ అధికారులు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి పరారైన సహిదూర్ రహమాన్ కోసం గాలింపు ముమ్మరం చేశారు. అతడు ఎక్కడికి వెళ్లాడు? పరారీకి ఎవరైనా సహకరించారా? అనే కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

**దర్యాప్తులో తేలాల్సి అంశాలు..**

ఎక్సైజ్ స్టేషన్ నుంచి ఖైదీ పరారీ కావడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, భద్రతా వైఫల్యానికి బాధ్యత ఎవరిదన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.




## ఇన్‌ఫ్లుయెన్సర్ల

# ఉచ్చులో పడొద్దు

**లక్ష్యసాధనలో తొందరపాటు నిర్ణయాలొద్దు**

**'జెన్ జీ'కి ప్రధాని నరేంద్ర మోదీ సూచనలు**



ఢిల్లీ, ఆగస్టు 12 :జీవితంలో త్వరగా లక్ష్యాన్ని చేరుకోవాలనే తొందరలో ఎంచుకునే షార్ట్‌కట్ మార్గాలు ఒక్కోసారి తీవ్ర నష్టాలకు దారితీస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. ముందుకు సాగాలంటే అర్థ వంతమైన, సరైన మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. మాజీ రాష్ట్ర పతి రామ్‌నాథ్ కోవింద్ రాసిన ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిప బ్లిక్ లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం ఉదయం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించారు.

తరువాయి 2వ పేజీలో...



# కొత్త మార్గంలో ప్రశాంత్ కిశోర్

**ప్రజాస్వామ్య వ్యవస్థలో సరికొత్త విధానానికి శ్రీకారం**

**గెలిచిన తరువాత హామీలు ఇచ్చిన పీకే**

హైదరాబాద్, ఆగస్టు 12

బీహార్‌లోని బాంకీపూర్ నుంచి కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన జన సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే)చేసిన తాజా ప్రకటనలు రాజ కీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపాయి.

తరువాయి 2వ పేజీలో...

## మిల్లర్ల నుంచి బకాయిలు
# వసూలు చేయాల్సిందే..

మొదటి పేజీ తరువాయి...

మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వీబీ జీ రామ్ జీ లో ఫ్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్‌పాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు.
సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గరిష్ట స్థాయిలో గోదావరి జలాల వినియోగం**

గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదని, ఈ విషయంలో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ఎన్డీఎస్‌ఏతో సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే అధికారులు వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం సూచించారు. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు.

గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ నియమించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

మొదటి పేజీ తరువాయి...

వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు.

**ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం**

PMAY-G కింద ఇచ్చే కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు.

**తెలంగాణ పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానం**

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి PMAY-G 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.

**క్యూర్ పరిధిలో నేడు ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం**

హైదరాబాద్ మహానగరంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలను సాకారం చేసే దిశగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.
క్యూర్ పరిధిలో చేపడుతున్న ప్రతిష్టాత్మక ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి గురువారం (13వ తేదీ) సాయంత్రం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్వయంగా శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంపై బుధవారం అధికారులతో మంత్రిగారు సమీక్షించారు.
ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కూకట్‌పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు శంకుస్థాపన చేయనున్న ఐదు ఎకరాల ప్రాంతంలో నాలుగు టవర్స్ నిర్మిస్తామని ఒక్కో టవర్‌లో 120 చొప్పున ఫ్లాట్స్ ఉంటాయన్నారు. ఒక్కో ఫ్లోర్‌లో 12 ఫ్లాట్స్ ఉండేలా 480 ఫ్లాట్స్ నిర్మాణం జరుగుతుందని దీనికోసం 43.20 కోట్ల రూపాయిలు ఖర్చవుతుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఇంతవరకు సుమారు 90 ఎకరాలను ఎంపిక చేశామని మంత్రి గారు తెలిపారు.

హైదరాబాద్ నగరం నడిబొడ్డున పేదవాడి ఇంటికి పునాది వేయడం అంటే కేవలం ఒక భవనం నిర్మించడం కాదు.. ఒక కుటుంబానికి భద్రత, ఒక తరానికి భరోసా, పేదవాడికి గౌరవంతో కూడిన జీవితం అందించడమే అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో నగరంలోనే సొంత ఇల్లు కావాలనే పేదల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఇందిరమ్మ టవర్స్‌ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు.
క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలు నగరానికి దూరంగా కాకుండా.. నగరంలోనే గౌరవంగా జీవించాలి అనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించిందన్నారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను సద్వినియోగం చేసుకుని బహుళ అంతస్తుల టవర్లను నిర్మించడం ద్వారా వేలాది పేద కుటుంబాలకు సొంతింటిని అందించనున్నామని తెలిపారు. ఇది ఒకసారి చేపట్టి ముగించే పథకం కాదని, హైదరాబాద్‌లో పేదల గృహ అవసరాలను దశలవారీగా తీర్చే నిరంతర గృహ నిర్మాణ కార్యక్రమని స్పష్టం చేశారు.
క్యూర్ పరిధిలో ఈ ఏడాది లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని , తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సుమారు 8,000 ఇళ్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు.
ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి గత నెల 20వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, ఇప్పటివరకు సుమారు 50 వేల దరఖాస్తులు అందాయని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు.
ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు అందించే ఇళ్లు సౌకర్యవంతంగా, ఆధునిక ప్రమాణాలతో నిర్మించనున్నామని తెలిపారు. ప్రతిపాదిత ఇంటిలో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో కలిపి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుందని చెప్పారు. నగరంలోని అత్యంత కీలక ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి పది అంతస్తుల వరకు టవర్లను నిర్మించనున్నట్లు వివరించారు. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో లబ్ధిదారుడి పేరుతో అన్‌డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారుడికి లభించే భూమి వాటా విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందన్నారు. ఇలాంటి విలువైన ప్రాంతాల్లో పేదలకు సొంతింటి అవకాశం కల్పించడం దేశంలోని ఇతర మహానగరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.
దరఖాస్తుల స్వీకరణ అనంతరం అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఎలాంటి రాజకీయ జోక్యం, సిఫార్సులు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన పేదల నుంచి పారదర్శక పద్ధతిలో డ్రా/లక్కీడిప్ ద్వారా ఇళ్ల కేటాయింపు చేపడతామని తెలిపారు.ఇల్లు మంజూరు కాని దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు చెల్లించిన ఈఎండీ మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లిస్తామన్నారు.
ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా, వేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది బోనాల పండుగ సమయానికి ఎంపికైన లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శంకుస్థాపన నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి దశను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులో నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.
గత ప్రభుత్వాల హయాంలో పేదలకు ఇళ్ల విషయంలో హామీలు మాత్రమే మిగిలాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మాత్రం హామీలను కార్యరూపంలోకి తీసుకువచ్చి, పేదల ఇంటి తలుపు తట్టేలా గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి పేర్కొన్నారు.

## ఇన్‌ఫ్లుయెన్సర్ల ఉచ్చులో పడొద్దు

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో 'జెన్ జీ'ని యువతకు పలు సూచనలు చేశారు. కొందరు ఫుట్‌బ్రిడ్జ్‌లను ఉపయోగించకుండా రైల్వే పట్టాలను దాటుతుంటారని, ఇలాంటి ప్రమాదకరమైన నిర్ణయాల వల్ల కలిగే నష్టాలను తెలియజేసేందుకే రైల్వేస్టేషన్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. 'ఏ షార్ట్ కట్ విల్ కట్ యూ షార్ట్' అని ఆ బోర్డులు హెచ్చరికలు చేయడమే కాకుండా, జీవితానికి పాఠాలు నేర్పుతాయన్నారు. ప్రస్తుతం యువతపై ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వీటి ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించారు.

**స్ఫూర్తి పొందాలి..**

నేటి డిజిటల్ యుగంలో 'జెన్ జీ'లో ఏకాగ్రత, లోతైన ఆలోచన శక్తి తగ్గిపోతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సమయం వృథా చేయకుండా, జీవితంలో నిజమైన పాఠాలు నేర్చుకోవడానికి మహనీయులు, నాయకుల ఆత్మకథలను చదవాలన్నారు. ఆత్మకథలు చదవటం వల్ల వారు ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాల నుంచి ఎంతో నేర్చుకోవచ్చన్నారు.
పుస్తకపఠం వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే కాకుండా, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందిస్తుందన్నారు. యువత డిజిటల్ యుగానికి పరిమితం కాకుండా నిరంతరం పుస్తకాలు చదవడం కొనసాగించాలని, దేశానికి సేవ చేసిన వారి అనుభవాలను చదివి స్ఫూర్తి పొందాలని స్పష్టం చేశారు. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరువాలంటే ఎప్పటికైనా కష్టపడే తత్వమే విజయాన్ని ఇస్తుందన్నారు.

**కోవింద్‌పై మోదీ ప్రశంసలు..**

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌పై ప్రధాని ప్రశంసలు కురిపించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన రామ్‌నాథ్ కోవింద్ జీవితం పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఎన్నో కష్టాలను ఓపికగా ఎదుర్కొని దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించారని పేర్కొన్నారు. రాష్ట్రపతి పదవి నుంచి విరమణ చేసిన తర్వాత కూడా కోవింద్ విశ్రాంతి తీసుకోకుండా దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై పనిచేస్తున్నారని కొనియాడారు.
ముఖ్యంగా 'వన్ నేషన్- వన్ ఎలక్షన్' (జమిలి ఎన్నికలు) వంటి అంశాలపై ఆయన కొనసాగిస్తున్న కృషి దేశసేవ పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. కోవింద్ చిన్ననాటి విషాదాన్ని గుర్తుచేసుకున్న ప్రధాని మోదీ భావోద్వేగానికి గురయ్యారు. బాల్యంలో వారి ఇల్లు అగ్నిప్రమాదానికి గురైనప్పుడు వస్తువులను కాపాడేందుకు ప్రయత్నించిన కోవింద్ తల్లి ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రస్తావించారు.

# కొత్త మార్గంలో ప్రశాంత్ కిశోర్

మొదటి పేజీ తరువాయి...

సాధారణంగా ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, ఆ తర్వాత వాటి అమలుకు దీర్ఘకాలిక ప్రక్రియ కొనసాగడం పరిపాటి. అయితే ప్రశాంత్ కిశోర్ మాత్రం ఎన్నికల అనంతరం తన నియోజకవర్గంలో ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమంలో భాగంగా.. 'ఆభార్ యాత్ర' పేరుతో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకోవడమే కాకుండా.. అనేక ప్రతిష్ఠాత్మక హామీలను ప్రకటించారు.

**వృద్ధులకు ఆర్థిక సాయం**

పేదరికంలో ఉన్న వృద్ధులకు నెలకు రూ.1,100 ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొన్నారు. ఉపాధి, విద్య, సామాజిక భద్రత మూడు కీలక అంశాలను ఒకేసారి స్పృశించే ప్రయత్నంగా ఈ హామీలను చూడవచ్చు. కాగా ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. హామీ ఇవ్వడం ఒకటైతే.. దానిని వ్యవస్థీకృతంగా అమలు చేయడం మరొకటి. ఎమ్మెల్యే వ్యక్తిగత పరిచయాల ద్వారా వేలాది ఉద్యోగాలను కల్పించడం ఎంతవరకు సాధ్యమవుతుంది? ఉద్యోగాలకు ఎంపిక చేసే విధానం ఎంత పారదర్శకంగా ఉంటుంది? ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకం వంటి అంశాలు కేవలం ఎమ్మెల్యే సంకల్పంతోనే పూర్తవుతాయా? వృద్ధులకు ఆర్థిక సహాయం అందించేందుకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి? ఇవన్నీ సమాధానం కావాల్సిన ప్రశ్నలే.. అయితే కిశోర్ మద్దతుదారులు మాత్రం ఆయన రాజకీయ వ్యూహకర్తగా, నిర్వాహకుడిగా సంపాదించుకున్న పరిచయాలు ఈ ప్రయత్నానికి ఉపయోగపడతాయని అంటున్నారు. మరోవైపు విమర్శకులు మాత్రం తక్కువ వ్యవధిలో 10 వేల ఉద్యోగాలు వంటి భారీ లక్ష్యాలు పెట్టుకోవడం వల్ల అంచనాలు కూడా అదే స్థాయిలో పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఈ హామీల ప్రభావం కేవలం బాంకీపూర్‌కు మాత్రమే పరిమితం కాకపోవచ్చు. వేగంగా ఉద్యోగ అవకాశాలను కల్పించడం, పాఠశాలలను మెరుగుపర్చడం, వృద్ధులకు ఆర్థిక సాయం అందించడం వంటివి ఇతర ప్రజాప్రతినిధులపైకూడా ఇలాంటి స్పందన చూపించాలనే ఒత్తిడి పెంచవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ పరిణామంలో మరో ముఖ్యమైన అంశం ప్రజల అంచనాల్లో మార్పు. జంతర్ మంతర్, రాంచీ వంటి ప్రాంతాల్లో జెన్‌జీ, యువత నేతృత్వంలో జరిగిన నిరసనలు వ్యవస్థను ప్రశ్నించే కొత్త రాజకీయ సంస్కృతికి సంకేతాలుగా నిలిచాయి. అదే విధంగా, ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ఉద్యోగాలు, విద్య, వృద్ధుల సంక్షేమంపై తక్షణ చర్యలకు పూనుకుంటే, ఇతర నియోజకవర్గాల ప్రజలు కూడా తమ ప్రజాప్రతినిధులను ఇదే తరహా లో ప్రశ్నించే అవకాశం ఉంది.

## కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్...
# ఓర్చుకోనుండాలోయ్ ఓటరా...

- ప్రశ్నించాల్సిన వారు... ప్రశ్నించడం మరిచారా? - అధికారం కోసం ప్రజలు ఓట్లు వేయలేదు...
- తమ సమస్యలపై మాట్లాడే ప్రతినిధుల కోసం ఓట్లు వేశారు.
- సమావేశాలకు కూడా హాజరు కాకపోతే,పాలన ఎలా సాగుతుంది???
- ప్రజా ప్రతినిధి నీ సమయం పైసలకా... పదవికా... ప్రజలకా?
- లేకపోతే రేపటి ఎన్నికల్లో "ఎవరికి ఓటేశాం?" అనే ప్రశ్న కంటే.. "ఎందుకు ఓటేశాం?" అనే ప్రశ్న??




ఆగస్టు 12ఐనవోలు : (ప్రజా కలం ప్రత్యేక కథనం)
అయినవోలు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పాలనపై ప్రస్తుతం గ్రామంలో చర్చ జరుగుతోంది. ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, గ్రామ అభివృద్ధికి బాటలు వేయాల్సి ఉండగా.. రాజకీయ సమీకరణాలు, వ్యక్తిగత ప్రయోజనాలు, అధికార పార్టీ ప్రాధాన్యతల చుట్టూ పాలన తిరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు చెందిన అభ్యర్థి సర్పంచ్‌గా విజయం సాధించగా, అత్యధిక సంఖ్యలో వార్డు సభ్యులను కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు గెలుచుకున్నారు. దీంతో పాలకవర్గంలో ప్రశ్నించే గొంతుకలు బలంగా ఉంటాయని, గ్రామ సమస్యలపై చర్చ జరిగి పారదర్శకమైన పాలన అందుతుందని ఓటర్లు ఆశించారు.కానీ ఆ ఆశలు క్రమంగా నీరుగారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రశ్నించాల్సిన వారు... ప్రశ్నించడం మరిచారా?**

గ్రామ పంచాయతీ పాలకవర్గంలో మెజారిటీ స్థానాలను గెలుచుకున్న వార్డు సభ్యులు ప్రజల తరఫున నిలబడి సర్పంచ్‌ను ప్రశ్నిస్తారని, గ్రామ అవసరాలపై చర్చిస్తారని ఓటర్లు భావించారు. కానీ అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, తమ బాధ్యతలను పక్కన పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారం కోసం ప్రజలు ఓట్లు వేయలేదు... తమ సమస్యలపై మాట్లాడే ప్రతినిధుల కోసం ఓట్లు వేశారు.,కానీ ఇప్పుడు ప్రజలే తమ ప్రతినిధుల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సమావేశాలకు కూడా హాజరు కాకపోతే... పాలన ఎలా సాగుతుంది???**

గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశాలు నిర్వహించడం, అభివృద్ధి పనులపై తీర్మానాలు చేయడం, బిల్లులు--ప్రతిపాదనలపై చర్చించడం పాలకవర్గ సభ్యుల ప్రాథమిక బాధ్యత. అలాంటి సమావేశాలకే కొందరు వార్డు సభ్యులు హాజరు కాకపోతే గ్రామ పాలన ఎలా ముందుకు సాగుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది.ఒకవైపు కోరం లేక సమావేశాలు, తీర్మానాలు, బిల్లుల విషయంలో ఇబ్బందులు తలెత్తే పరిస్థితి, మరోవైపు ప్రజా సమస్యలను పట్టించుకోని పాలకవర్గం ఉంటే చివరకు నష్టపోయేది ఎవరు? ప్రజలే కదా!

**పాలకా నీ సమయం పైసలకా... పదవికా... ప్రజలకా?** ప్రజలు తమ ఓటును కేవలం ఒక పార్టీకి వేయలేదు. తమ ఇంటి ముందు రోడ్డు బాగుండాలని, డ్రైనేజీ సమస్య పరిష్కారం కావాలని, వీధిలైట్లు వెలగాలని, తాగునీటి సమస్య తీరాలని, గ్రామానికి అభివృద్ధి పనులు రావాలని ఆశించారు. యువతకు ప్రాధాన్యత ఇచ్చి, కొత్త ఆలోచనలతో మంచి పరిపాలన అందిస్తారని నమ్మి ఎన్నుకున్న ప్రతినిధులే అధికారం చుట్టూ తిరుగుతూ ప్రజల సమస్యలను మరిచిపోతే.. ఆ నమ్మకానికి విలువ ఎక్కడ?ప్రజాస్వామ్యంలో పదవి అనేది ప్రజలకు సేవ చేసే బాధ్యత, వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకునే అవకాశం కాదు.

**ఓటరా... నీ ఓటు విలువ ఇదేనా??**

ఎన్నికల సమయంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడిగిన నాయకులు, గెలిచిన తర్వాత ప్రజలకు అందుబాటులో లేకపోతే ఓటరు ప్రశ్నించాల్సిందే.

**"కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్.. ఓర్చుకోనిండాలోయ్ ఓటరా?"** అని ప్రశ్నించే పరిస్థితి రాకూడదంటే పాలకవర్గ సభ్యులు తమ బాధ్యతలను గుర్తించాలి. ఏ పార్టీ అధికారంలో ఉందన్నది కాదు.. గ్రామానికి ఎవరు ఉపయోగపడుతున్నారు అన్నదే ముఖ్యం. ప్రజలు ఇచ్చిన మెజారిటీని రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా గ్రామాభివృద్ధి కోసం ఉపయోగించాలి. సర్పంచ్‌తో పాటు ప్రతి వార్డు సభ్యుడు కూడా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి.లేకపోతే రేపటి ఎన్నికల్లో "ఎవరికి ఓటేశాం?" అనే ప్రశ్న కంటే.. "ఎందుకు ఓటేశాం?" అనే ప్రశ్నే ఓటరును వెంటాడే ప్రమాదం ఉంది.అయినవోలు గ్రామ పంచాయతీ పాలన గాడిలో పడాలంటే రాజకీయ గులామీకి స్వస్తి పలికి, ప్రజా సమస్యలపై ప్రశ్నించే ధైర్యం ఉన్న పాలకవర్గం ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అమిత్ షా వర్సెస్ రాహుల్!



## విద్యార్థులపై లాఠీచార్జికి చర్చకు సిద్ధం : కేంద్ర హోంమంత్రి అమిత్ షా
## లాఠీచార్జిపై సూటిగా సమాధానం కావాలి : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 12 : నీట్ పేపర్ లీక్, ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలు, లాఠీచార్జి అంశాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను మరింత వేడెక్కించాయి. ప్రతిరోజు విపక్ష సభ్యులు ఈ అంశాలపై ఆందోళనలు చేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబడుతు న్నాయి. ఈ నేపథ్యంలో స్పందించిన అమిత్ షా.. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అవసరమైతే 24 గంటల పాటు సభను నిర్వహించి ప్రతి అంశంపైనా చర్చిద్దామని, విపక్ష సభ్యులు లేవనెత్తే ప్రతి ప్రశ్నకు తానే సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు. అయితే అమిత్‌షా ప్రతిపాదనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. తమకు హోంమంత్రి లెక్చర్లు అవసరం లేద ని, విద్యార్థులపై కాల్పులు, లాఠీచార్జికి ఆదేశాలిచ్చింది ఎవరో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

**అమిత్‌షా సవాల్..** ఢిల్లీ ఘటనలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు సిద్ధమని స్పష్టం చేసిన అమిత్‌షా .. ప్రతిపక్షాలకు 24 గంటల చర్చకు సవాల్ విసిరారు. ప్రతిపక్షాలు బుధవారం మధ్యాహ్నం 2 గంటలలోపు స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు 24 గంటలపాటు చర్చ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చర్చలో స్వయంగా పాల్గొంటానని, విపక్ష సభ్యుల ప్రతి ప్రశ్నకు పాయింట్ల వారీగా సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు.

**దాచడానికి ఏమీ లేదు..**

నీట్ పేపర్ లీక్, విద్యార్థుల ఆందోళనల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి దాచాల్సిందేమీ లేదని అమిత్‌షా అన్నారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభు త్వం చర్చకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. అయితే పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకోవడం ద్వారా ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా చేయడం సరికాదని విపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తీవ్రమైన అంశాలను సభలో కేవలం ఒక ప్రకటనతో ముగించలేమని అమిత్‌షా స్పష్టం చేశారు.
పార్లమెంటులో చర్చకు నిర్దిష్టమైన నియమ నిబంధనలు ఉన్నాయని, వాటి ప్రకారమే సమగ్ర చర్చ జరగాలని అన్నారు. అవసరమైతే స్పీకర్ అనుమతితో ప్రశ్నోత్తరాల సమయాన్ని వాయిదా వేసి చర్చ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. సభలో ప్రకటన చేసి వెళ్లిపోవడం పార్లమెంటరీ విధానం కాదని, సభ్యులు లేవనెత్తే అంశాలపై పూర్తిస్థాయిలో చర్చ జరగాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**ప్రతి రోజూ పార్లమెంట్‌కు వస్తున్నా..**

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి క్రమం తప్పకుండా సభకు హాజరవుతున్నానని అమిత్‌షా చెప్పా రు. 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి వ్యాఖ్యలు పార్లమెంటరీ చర్చల్లో వినిపిస్తున్నాయని ప్రస్తావించారు. తాను తన ఛాం బర్‌లోనే ఉంటున్నానని, ఉభయ సభలను విపక్షాలు సాగనివ్వకుండా చేస్తే సభకు వచ్చి ఏం చేయగలనని ప్రశ్నించారు. హంగామా చేయడం మానేసి చర్చకు రావాలని, నిర్ణ యం వారి చేతుల్లోనే ఉందని, అర్థవంతమై న చర్చ కావాలా.. సభలో రచ్చ కొనసాగించాలా విపక్షాలే తేల్చుకోవాలని అన్నారు.

**మాకు లెక్చర్లు వద్దు : రాహుల్**

హోంమంత్రి లోక్‌సభలో ఇచ్చే ఉపన్యాసాలు వినేందుకు విపక్షాలు, దేశ యువత సిద్ధంగా లేదని రాహుల్‌గాంధీ అన్నారు. తమకు లెక్చర్లు అవసరం లేదని, విద్యార్థులపై జరిగిన చర్యలకు సంబంధించిన ప్రశ్న లకు స్పష్టమైన సమాధానాలు మాత్రమే కావాలని తేల్చిచెప్పారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కాల్పులు జరపాలని ఎవరు ఆదేశించారో హోం మం త్రి చెప్పాలని డిమాండ్ చేశారు.
'మేకులున్న లాఠీలతో కొట్టేందుకు ఆదేశాలు ఎవరిచ్చా రో వెల్లడించాలన్నారు. ఆదేశాలు ఆయనే ఇచ్చి ఉంటే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఒకవేళ ఆయనకు తెలియకుండానే ఈ ఘోరం జరిగి ఉంటే ఆయన ఈ పదవికి పనికిరారు. హోంమంత్రికి సభకు వచ్చి మ మ్మల్ని ఎదుర్కొనే ధైర్యం లేదు. నిజం చెప్పే సాహసం లేకనే దాక్కుంటున్నారు.
ఆయన మౌనమే ఆయన నేరాన్ని అంగీకరించినట్లు స్పష్టం చేస్తోంది. సభలో ఊహాజనిత కబుర్లు చెప్పడం మాకు అవసరం లేదు. కాల్పులకు బాధ్యులెవరో స్పష్టంగా తేల్చాలి.
ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా ఇద్దరికీ నిజాలను ఎదుర్కొనే గుండెధైర్యం లేదు' అని రాహుల్ విమర్శించారు.

## జిల్లాలో పోలీస్ డాగ్ స్క్వాడ్ తనిఖీలు

### స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత




జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం) ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జగిత్యాల జిల్లా పోలీసులు




కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా లోని ముఖ్యమైన ప్రాంతాల్లో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో బాంబ్ డిస్పోజల్ టీమ్, శిక్షణ పొందిన పోలీసు జాగిలాలతో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు తదితర ప్రాంతాల్లో అనుమానాస్పద వస్తువులు, వాహనాలపై తనిఖీలు నిర్వహించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

**అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి - ఎస్పీ**

ప్రజలు తమ పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలు, బ్యాగులు, పార్సిళ్లు లేదా ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా పరిశీలించవద్దని, వాటికి దూరంగా ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో బాంబ్ డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసిన అబ్దుల్ జాకీర్

### మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియామకం



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం)

కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన అబ్దుల్ జాకీర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అబ్దుల్ జాకీర్‌ను మంత్రి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ జాకీర్ మాట్లాడుతూ మైనారిటీ ప్రజల సంక్షేమం కోసం, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మారుతి బాపూజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాజల రాజగోపాల్ రావు పాల్గొని అబ్దుల్ జాకీర్‌ను అభినందించారు. అందరి ఆశీస్సులు, సహకారంతో పార్టీ కోసం, మైనారిటీ ప్రజల సంక్షేమం కోసం ముందుకు సాగుతానని అబ్దుల్ జాకీర్ తెలిపారు.

## సెప్టెంబర్ 9న వరంగల్ లో జరిగే,జాతీయ మహాసభను విజయ వంతం చేయండి

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లో సమీక్ష సమావేశం

పద్మశ్రీ" మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు

రేణుకుంట్ల సాగర్ మాదిగ ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, జగిత్యాల జిల్లా ఇంచార్జ్

ఇబ్రహీంపట్నం ఆగస్టు 12 (ప్రజా కలం ప్రతినిధి )

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, కోరుట్ల నియోజకవర్గం పర్యవేక్షకులు చెట్టు పెల్లి లక్ష్మణ్ మాదిగ అధ్యక్షతన ఇబ్రహీంపట్నం మండలం సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి జగిత్యాల జిల్లా ఇన్చార్జ్, రేణుకుంట్ల సాగర్ మాదిగ, హాజరై మాట్లాడుతూ "పద్మశ్రీ" మందకృష్ణ మాదిగ గారు సమాజంలో ప్రతి పేద కుటుంబానికి ఉపయోగపడే విధంగా ఎన్నో పోరాటాలు చేసి సమాజంలో అన్ని వర్గాల పేద వర్గాలకు ఫలాలు అందించారు. జాతి సమగ్ర అభివృద్ధికై అలాగే అన్ని వర్గాలలో పేదల సమగ్ర అభివృద్ధికై అలాగే అన్ని వర్గాలలో పేదల సమగ్ర అభివృద్ధికి కూడా ఎమ్మార్పీఎస్, శక్తివంత లేకుండా పాట పాటుపడడం ఎమ్మార్పీఎస్, లక్ష్యం అన్నారు. పూలే, అంబేద్కర్, గారి జగ్జీవన్ రావు, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఎమ్మార్పీఎస్, లక్ష్యం మని అన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, "పద్మశ్రీ" మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాబోవు రోజుల్లో సామాజిక ఆర్థిక అసమానతపై మరో పోరాటానికి మాదిగలు సిద్ధంగా ఉండాలని రేపు సమాజానికి మాదిగ జాతి సామాజిక ఉ ద్యమానికి దిక్సూచిలా ఉండేలా ఉద్యమం నిర్మాణం జరగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి, జిల్లా మాజీ అధ్యక్షులు చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ, ఇబ్రహీంపట్నం మండలం నాయకులు బంగారు హరిదాస్ మాదిగ, పోడేటి సురేష్, గొర్రె శ్రీను, తిమ్మని రాజాం, కనక గంగాధర్, కొత్తూరి నర్సయ్య, కనక దినేష్, దిలీప్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.



### బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది విధుల్లో

# అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ - ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించాలి



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజా కలం)

ప్రజలకు పోలీస్ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయం లో బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బందితో జిల్లా ఎస్పీఅశోక్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ బ్లూ కోల్ట్, పెట్రో కార్స్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్, అత్యవసర స్పందన, నేర నియంత్రణ, నేరస్తులపై నిఘా, కమ్యూనిటీ పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. హాట్‌స్పాట్‌ల వద్ద పెట్రోల్ వాహనాలను కొద్దిసేపు నిలిపి, అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలు, కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకులు, ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**డయల్ -112 కాల్స్‌కు తక్షణం స్పందించాలి**

కంట్రోల్ రూమ్, పోలీస్ స్టేషన్, డయల్-112 లేదా ప్రజల నుంచి అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం, బాధితులు, సాక్షుల నుంచి సమాచారం సేకరించడం, సంఘటనా స్థలాన్ని భద్రపరచడం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. బ్యాంకులు, ఏటియం ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితులు, ఆస్తి సంబంధిత నేరస్తులు, దొంగసొత్తు కొనుగోలు చేసే వ్యక్తులు, తరచూ నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, రెసిడెంట్ అసోసియేషన్లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో తరచూ కమ్యూనిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తులను సకాలంలో గుర్తించి, వేగంగా స్పందించి వారి ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్ట్, పెట్రోల్ కార్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి విలువైన ప్రాణాలను కాపాడటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిసిఆర్బీ డిఎస్పి రవి కుమార్, బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం)

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వసతి గృహంలోని నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలించిన కలెక్టర్ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా కిచెన్ షెడ్‌ను నాణ్యతతో నిర్మించాలని, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఓపీ, ఐపీ సేవలు, ల్యాబ్ రికార్డులు, ఐపీ రికార్డులు, మెడికల్ ఫార్మసీ తదితర వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. రోజువారీగా ఎన్ని ఓపీలు నమోదవుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో



డెంగ్యూ, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, గడువు ముగిసిన మందులు ఆసుపత్రిలో లేకుండా చూడాలని ఆదేశించారు. రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలు, చికిత్స వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రి ఆవరణలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. రాజ్‌కుమార్, జిల్లా వైద్యాధికారి సుజాత, తహసీల్దార్, ఎంపీడీవో, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి

### సైబర్,గల్ఫ్ మోసాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

### గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి

### వార్షిక తనిఖీల్లో భాగంగా రుద్రంగి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే






రుద్రంగి, ఆగష్టు 12, (ప్రజాకలం ప్రతినిధి)

నేరాల నియంత్రణకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూనే ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ కి పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్లు పరిశీలించి అభినందించారు. అనంతరం స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ఆరా తీసి, కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు, సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు. పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్స్ లో అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతిక పద్ధతులను సిబ్బంది అందిపుచ్చుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించేందుకు ఈ వ్యవస్థ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సైబర్ మోసాలు, గల్ఫ్ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించలని, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, వీసా మోసాలు, నకిలీ ఏజెంట్ల మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బంది గ్రామాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి అనుమానితులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా ఉంచి తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తు, ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అవి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని,నేను సైతం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో వాటి పాత్రను తెలియజేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ రవీందర్, ఎస్.ఐ మోతిరాం నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యసనాలకు దూరంగా ఉండి

## బలమైన సమాజాన్ని నిర్మించాలి

### - కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం) నషా ముక్త్ భారత్ అభియాన్, మిషన్ స్పందన ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ కోరుట్ల కేంద్రం నిర్వహించిన వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం బుధవారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ చైతన్యవంతమైన పౌరులుగా ఎదిగి, బలమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బ్రహ్మకుమారీస్ కోరుట్ల కేంద్ర నిర్వాహకురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలోని బృందం విద్యార్థులతో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, డైరెక్టర్ హరిప్రియ అంజయ్య గౌడ్, ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూలిన ఇంటిని పరిశీలించిన సర్పంచ్



రుద్రంగి, ఆగష్టు 12, (ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు లింగాల పోషవ్వ కు చెందిన ఇళ్ళు కూలిపోగా సర్పంచ్ గండి నారాయణ కూలిన ఇంటిని బుధవారం పరిశీలించారు. ఇట్టి విషయాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి పోసవ్వ కు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు అయేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. సర్పంచ్ వెంట అక్కెనపెల్లి శ్రీనివాస్, దాసరి గంగరాజం, ఒద్యారపు ఆనంద్, దయ్యాల రమేష్ మల్యాల లింగయ్య తదితరులు ఉన్నారు.

### మిలాద్ ఉల్ నబీ నేపథ్యంలో

## పాంచజన్య సభ వాయిదా

- ఆగస్టు 31న నిజామాబాద్‌లో పాంచజన్య సభ
- సభ విజయవంతంపై తెలంగాణ రక్షణ సేన ముఖ్య కార్యకర్తల సమావేశం




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం) నిజామాబాద్,మిలాద్ ఉల్ నబీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 26న నిర్వహించాల్సిన పాంచజన్య సభను ఆగస్టు 31కి వాయిదా వేసినట్లు తెలంగాణ రక్షణ సేన నిర్వాహకులు తెలిపారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సభ తేదీని మార్చినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాంచజన్య సభను విజయవంతం చేసేందుకు తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సభ ఇన్‌చార్జ్ డాక్టర్ రఘు ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. సభకు ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించడం, ఏర్పాట్లను వేగవంతం చేయడం, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి సభ విజయవంతానికి కృషి చేయాలని డాక్టర్ రఘు సూచించారు. ఆగస్టు 31న జరిగే సభకు అవసరమైన ఏర్పాట్లను మరింత వేగవంతం చేసి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో అజార్ భాయ్‌తో పాటు తెలంగాణ రక్షణ సేన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌కు సన్మానం

### మెట్‌పల్లి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం) జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో బుధవారం మెట్‌పల్లి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మెట్‌పల్లి



ప్రాంతంలో ఔషధ విక్రయాలు, ఫార్మసీల నిర్వహణ తదితర అంశాల్లో నిబంధనల అమలుకు సహకరిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండారి విజయకృష్ణ, కోశాధికారి చిలివేరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గరీపల్లి సాగర్, సామర్ల గోవర్ధన్, కార్యవర్గ సభ్యులు జోగ రఘురాం, నాగరాజ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కలం
గురువారం, ఆగస్టు 13, 2026

## యాంటీబయాటిక్స్ అధిక వినియోగంతో పలు ఆరోగ్య సమస్యలు

సాధారణ అనారోగ్యాలకు కూడా యాంటీబయాటిక్స్‌ను సులభమైన పరిష్కారంగా భావించే ధోరణి భారత్‌లో ప్రమాదకర స్థాయికి చేరుకుంది. అంటువ్యాధుల నియంత్రణలో యాంటీబయాటిక్స్ కీలకమైనప్పటికీ, వాటి విచక్షణారహిత వినియోగం భవిష్యత్ ఆరోగ్య సంక్షోభానికి దారితీస్తోంది. ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్లో ప్రచురితమైన తాజా అధ్యయనం భారత్‌లో యాంటీబయాటిక్ వినియోగంలో ఉన్న అసమతుల్యతను బయటపెట్టింది. బలమైన మందులపై అధిక ఆధారపడటం, ప్రాథమిక స్థాయి మందుల తక్కువ వినియోగం ఆందోళన కలిగించే అంశాలుగా అధ్యయనం పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ యాంటీబయాటిక్స్‌ను "యాక్సెస్", "వాచ్", "రిజర్వ్" అనే మూడు వర్గాలుగా విభజించింది. సాధారణ ఇన్ఫెక్షన్లకు మొదటి ఎంపికగా ఉపయోగించాల్సిన "యాక్సెస్" మందులు తగిన స్థాయిలో వినియోగించాలి. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగించాల్సిన "వాచ్" మందులను అవసరం లేకుండా వాడితే సూక్ష్మజీవుల్లో నిరోధకత పెరుగుతుంది. తీవ్రమైన, ఇతర మందులకు స్పందించని ఇన్ఫెక్షన్ల కోసం ఉంచాల్సిన "రిజర్వ్" యాంటీబయాటిక్స్‌ను అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగించాలి. అధ్యయనం ప్రకారం, భారత్‌లో యాంటీబయాటిక్స్ వినియోగం రోజుకు ప్రతి 1,000 మందికి సుమారు 18.3 నిర్వచిత రోజువారీ మోతాదులుగా ఉంది. అయితే సరైన వినియోగ స్థాయి 9.9 నుంచి 14.7 ఱఱఱల మధ్య ఉండాలని అంచనా వేయబడింది. ముఖ్యంగా "వాచ్" వర్గానికి చెందిన యాంటీబయాటిక్స్ వినియోగం రోజుకు ప్రతి 1,000 మందికి 9.3 మోతాదులుగా ఉండగా, ఇది సిఫారసు చేసిన 6 మోతాదుల కంటే ఎక్కువ. అదే సమయంలో సాధారణంగా ఉపయోగించాల్సిన "యాక్సెస్" యాంటీబయాటిక్స్ వినియోగం 4.5 మోతాదులకే పరిమితమవుతోంది. బలమైన యాంటీబయాటిక్స్ తీసుకుంటే త్వరగా కోలుకుంటామనే భావన ప్రజల్లో పెరిగింది. రోగులు త్వరిత ఉపశమనాన్ని కోరుకోవడం, వైద్యులపై ఉన్న అధిక పని ఒత్తిడి కూడా విస్తృత ప్రభావం కలిగిన మందుల సూచనకు కారణమవుతున్నాయి. కానీ అవసరం లేని ప్రతి యాంటీబయాటిక్ మోతాదు భవిష్యత్ చికిత్స అవకాశాలను తగ్గిస్తుంది. బ్యాక్టీరియా మందులకు లొంగని స్థితి ఏర్పడితే సాధారణ ఇన్ఫెక్షన్లు కూడా ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. భారత్‌లో యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయి. వైద్య సలహా లేకుండా మందులు కొనుగోలు చేయడం, సరైన నిర్ధారణ పరీక్షలు అందుబాటులో లేకపోవడం, ఆరోగ్య సేవలలో అసమానతలు, పశు సంవర్ధక మరియు వ్యవసాయ రంగాల్లో యాంటీబయాటిక్స్ అధిక వినియోగం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. అయితే అంటువ్యాధుల భారం అధికంగా ఉన్న భారత్‌లో యాంటీబయాటిక్స్ అవసరాన్ని విస్మరించలేం.

పరిష్కారం వినియోగాన్ని పూర్తిగా తగ్గించడం కాదు; సరైన రోగికి, సరైన సమయంలో, సరైన మందు అందేలా చూడటం. ఆధారపూర్వక వైద్యం, మెరుగైన నిర్ధారణ వ్యవస్థలు, వైద్యుల శిక్షణ, ప్రజల్లో అవగాహన పెంపు అత్యంత అవసరం. యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌పై జాతీయ కార్యాచరణ ప్రణాళిక 2025–2029లో పేర్కొన్న విధంగా మానవ ఆరోగ్యం, పశుసంవర్ధక, వ్యవసాయ రంగాల్లో బాధ్యతాయుతమైన యాంటీబయాటిక్ వినియోగాన్ని ప్రోత్సహించాలి. ఔషధ సరఫరా వ్యవస్థలో కఠిన నియంత్రణలు అమలు చేసి, ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయాలను అరికట్టాలి. యాంటీబయాటిక్స్ సాధారణ మందులు కావు; అవి మానవాళికి అందుబాటులో ఉన్న కీలక రక్షణ సాధనాలు. వాటిని జాగ్రత్తగా ఉపయోగించడం ద్వారా మాత్రమే భవిష్యత్ తరాలకు సమర్థవంతమైన చికిత్సా అవకాశాలను కాపాడగలం

– హెచ్. ప్రతాప్

## పీఆర్సీని వెంటనే ప్రకటించకుంటే అసెంబ్లీ ముట్టడి

### - యూఎస్పీసీ హెచ్చరిక.. ఈ నెల 19న జిల్లా కేంద్రాల్లో మహాధర్నా




మెట్ పల్లి కోరుట్ల ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం) కోరుట్ల, పీఆర్సీని వెంటనే ప్రకటించడంతో పాటు బకాయి ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో వచ్చే నెలలో అసెంబ్లీని ముట్టడిస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ప్రభుత్వాన్ని హెచ్చరించింది. విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూఎస్పీసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం కోరుట్ల డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో 29 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 25ను సవరించాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సమగ్ర శిక్షా ఉపాధ్యాయులు,ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని గురుకులాలకు ఒకే సమయపాలన అమలు చేయాలని కోరారు. పీఆర్సీని ప్రకటించని పక్షంలో ఈ నెల 19న జిల్లా కేంద్రాల్లో, 29న రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహిస్తామని యూఎస్పీసీ నాయకులు స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే తదుపరి దశలో అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ నాయకులు తిరుకోవెల శ్యామ్ సుందర్, గట్ల సంతోష్, చింత మోహన్ ప్రసాద్, కృష్ణ రాజన్, పరంకుషం వెంకట ప్రసాద్, గడ్డల శ్రీధర్, కల్వకోట వెంకట స్వర్ణలత, శామకుర శ్రీనివాస్, మాసం చిరంజీవి, సలీం, దొడ్డ జ్యోతి, రాధ, నాగుల రాహుల్, అజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి పనుల పురోగతిని పరిశీలించిన అదనపు కలెక్టర్



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం)

కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో వీబీజీ రామ్‌జీ పథకం కింద చేపట్టిన జలసిరి పనుల పురోగతిని అడిషనల్ కలెక్టర్ బి. రాజగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న జలసిరి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల ప్రస్తుత స్థితిగతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, రైతులకు ప్రయోజనం చేకూరేలా జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో డీఆర్డీఓ రఘువరన్, ఎంపీడీవో రామకృష్ణ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కోర్టుల చుట్టూ కర్షకులు

### కేసులు ఎత్తివేసేదెప్పుడు? - 2021 నాటి రైతు ఉద్యమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్




మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం) రైతుల సమస్యల పరిష్కారం కోసం 2021 సెప్టెంబర్‌లో శాంతియుతంగా నిర్వహించిన నిరసనలో పాల్గొన్న రైతులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, చెరుకు ఫ్యాక్టరీ పునరుద్ధరణ తదితర డిమాండ్లతో జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో మెట్‌పల్లి డివిజన్ కేంద్రంగా సుమారు 5 వేల మంది రైతులతో శాంతియుత నిరసన చేపట్టినట్లు తెలిపారు. అయితే జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులు పాల్గొన్న ఆ నిరసనకు సంబంధించి 18 మంది రైతులపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసిందని రైతు నాయకులు ఆరోపించారు. 2021 నుంచి ఇప్పటివరకు కేసుల విచారణ నిమిత్తం కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న తాము పంటలు, పశువులను వదిలి కోర్టులకు హాజరుకావాల్సి వస్తోందన్నారు. రైతు సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందించేందుకు శాంతియుతంగా వెళ్లిన తమపై కేసులు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం తమపై కక్షపూరితంగా వ్యవహరించి అక్రమ కేసులు బనాయించిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి గత ప్రభుత్వ హయాంలో రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. ప్రజా పాలనలో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం లభిస్తుందని, తమ కేసుల విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, బందెల మల్లన్న, మారు మురళీధర్ రెడ్డి, అల్లూరి మహేందర్ రెడ్డి, అన్నాడి జలపతి రెడ్డి, వెంపేట్ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్, ఉప సర్పంచ్ సురేందర్ రెడ్డి, శంకర్ రెడ్డి, వేముల కరుణాకర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కొమిరెడ్డి లింగారెడ్డి, వామన్ రెడ్డి, ముత్యంరెడ్డి, కొమ్ము సంతోష్ రెడ్డి, గంగారెడ్డి, లింగారెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## చేయూత పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

### – ఈ నెల 31 వరకు అవకాశం..
### – మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం) ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చేయూత పింఛన్ల మంజూరుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేతివృత్తిదారులు, చేనేత కార్మికులు, పైలేరియా బాధితులు, కల్లుగీత కార్మికులు, డయాలసిస్ బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు తదితర అర్హత కలిగిన వారు చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి, నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ కోరారు.

## భయం వీడితేనే భవిష్యత్తుకు భరోసా

### - గాయత్రి కళాశాలలో ఉపాధి అవగాహన సదస్సు



పెద్దపల్లి,ఆగస్టు12:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) చదువుతో పాటు మంచి ఉపాధి అవకాశాలు ఉంటేనే యువత భవిష్యత్తు బంగారుమయం అవుతుందని ప్లై సంస్థ విభాగాధిపతి విశ్వరూపిణి,మానవ వనరుల విభాగ ప్రతినిధి నఫిజా అన్నారు.జిల్లా కేంద్రంలోని గాయత్రి డిగ్రీ,పీజీ కళాశాలలో బుధవారం గో ప్లై ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు.యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించింది.?ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు గో ప్లై విభాగ ప్రతినిధులు విశ్వరూపిణి,నఫిజా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రస్తుత కార్పొరేట్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలు, ఆఫీస్‌లలో పని చేసే వాతావరణం,వివిధ ఉద్యోగ హోదాలు,కెరీర్ ప్రాస్పెక్ట్స్ మరియు పని అనుభవానికి ప్రాధాన్యత వంటి కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.విద్యార్థులు భయం వీడి,ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని భరోసా కల్పించారు.

ఈ అవగాహన సదస్సులో సుమారు 60 మంది విద్యార్థులు తమ వివరాలతో కూడిన బయోడేటా పత్రాలను కంపెనీ ప్రతినిధులకు అందజేశారు.విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కళాశాల ప్రాంగణంలో ఇలాంటి చక్కటి ఉపాధి అవకాశాలను కల్పించిన గో ప్లై ప్రతినిధి బృందాన్ని కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## వైద్య సేవల్లో సమన్వయం తప్పనిసరి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,ఆగస్టు12:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో వైద్య సేవలకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియను అవసరాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



అందుబాటులో ఉన్న సిబ్బందిని అవసరమైన ఆసుపత్రులకు సర్దుబాటు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని,ప్రభుత్వ ఆసుపత్రుల పరిసరాలు,వార్డులు,వైద్య గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.రోగులకు అవసరమైన మందులు,వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు.అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి తక్షణమే చికిత్స అందేలా చూడాలని తెలిపారు.ఆసుపత్రుల్లో ఉత్పత్తయ్యే బయోడిగ్రేడబుల్ వ్యర్థాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు.రాష్ట్ర స్థాయిలో సమస్య పరిష్కారమయ్యే వరకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా వ్యర్థాలను సురక్షితంగా,నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు.ఆసుపత్రుల్లో తాగునీరు,విద్యుత్,పారిశుధ్య సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని తెలిపారు.సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని,క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ వ్యాధుల వ్యాప్తికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రజల నుంచి వచ్చే వైద్య సేవల సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ పవిత్ర,డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్,సుల్తానాబాద్ డీసీహెచ్ఎస్ డాక్టర్ రమాదేవి,వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మార్వో కి మెమోరాండం అందజేత



(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 12, ప్రజాకలం ప్రతినిధి.

బుధవారం మధ్యాహ్నము భోజన విరామ సమయంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పర్వతగిరి మండల తహశీల్దార్ కి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై మెమోరాండము సమర్పించడం జరిగింది. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రెండో దశ ఉద్యమం ద్వారా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదురుచూస్తున్నటువంటి పిఆర్సి, 6 డిఏ లు, పెండింగ్లో ఉన్నటువంటి ఉద్యోగుల, పెన్షనర్ల బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాల్సిందిగా తెలియజేయడం జరిగింది. సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలి. 2003 ఉపాధ్యాయులు అందరికీ కూడా పాత పెన్షన్ వర్తింపజేయాలి. ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను వేసవిలోనే నిర్వహించాలని, జీవో ఎంఎస్ 25 ని సవరించాలని ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు తరగతి ఒక ఉపాధ్యాయుని నియమించాలని వారు కోరారు. ఈ కార్యక్రమం డిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహంకాళి రామస్వామి, గుగులోతు కిషన్, యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి. సంపత్, అరవింద్ కుమార్, టిపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిండి మల్లికార్జున్, డి. రమేష్, సురేష్ బాబు, వీరేందర్, కల్లూరి సుభాషిని, ఏ. లలితా దేవి, పి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా.. క్రీడలకు చేరువగా యువత ముందుకు సాగాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,ఆగస్టు12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామాలను జీవితంలో భాగంగా చేసుకొని యువత ఆరోగ్యకరమైన జీవన విధానం వైపు ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజం,డ్రగ్స్ రహిత యువతే లక్ష్యంగా సెప్టెంబర్ 27న నిర్వహించనున్న నాలుగో కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్‌ను పెద్దపల్లి ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.క్రీడలు,వాకింగ్, జాగింగ్, రన్నింగ్ వంటి శారీరక వ్యాయామాలను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు చురుకైన జీవనశైలిని కొనసాగించవచ్చని తెలిపారు.డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న హాఫ్ మారథాన్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లను




ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు,వ్యాయామం వంటి సానుకూల కార్యకలాపాలపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజూ నడక,పరుగు,వ్యాయామం వంటి వాటిని జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణతో పాటు సమాజంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన పెంపొందించడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు.

హాఫ్ మారథాన్‌లో యువతతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ ప్రవీణ్ రెడ్డి,కేఆర్‌సీఏ అధ్యక్షులు పసుల మహేష్,మహిపాల్ రెడ్డి,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ రైస్ సరఫర గడువు లోగా పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ బి శ్రీరాములు**

**- సిఎంఆర్ రైస్ డెలివరీ పై సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్**



పెద్దపల్లి,ఆగస్టు12:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) రబీ 2024-25 సీజన్ కి సంబంధించి సీఎంఆర్ రైస్ సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు అన్నారు.బుధవారం అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో సిఎంఆర్ రైస్ డెలివరీ పై సంబంధిత అధికారులు,రైస్ మిల్లర్ల సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ రబీ 2024-25 సీజన్ కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేసి సకాలంలో అందించాలని,సీఎంఆర్ సరఫరాలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని, గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని రైస్ మిల్లులలో ఎఫ్ సి ఐ నిబంధనల ప్రకారం రా రైస్,పాలిష్ రైస్ నాణ్యత లోపం వంటి సమస్యలు పరిష్కరించి ఎటువంటి సమస్యలు లేకుండా త్వరితగతిన సి.ఏం.ఆర్.ను గడువు లోగా పూర్తి చేయుటకు ఎఫ్.సి.ఐ అధికారులకు సూచించారు.రైస్ మిల్లర్లకు సంబంధించి రోజువారీగా రిజిస్టర్ నమోదు చేయాలని,గన్ని సంచుల కోతలు,నెంబర్స్ నమోదు ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్,మేనేజర్ శ్రీకాంత్,రైస్ మిల్లర్లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయానికి యత్నం.. ఇద్దరి అరెస్ట్

మల్లాపూర్ ఆగష్టు 13 (ప్రజా కలం)చిట్టాపూర్ గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫారం వద్ద గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు మల్లాపూర్ ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. రిశిత్ రెడ్డి (21), రాజ్‌కుమార్ (24)లను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణలో గంజాయిని కొనుగోలు చేసి కొంత సేవించి, మిగిలినదాన్ని విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. గంజాయి సరఫరాకు సంబంధంఉన్న మరో వ్యక్తి కోసం దర్యాప్తుకొనసాగుతోందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఆటల పోటీలు ప్రారంభం

**ఆటల పోటీలను ప్రారంభించిన సర్పంచ్ మహేష్**



ధర్మారం, ఆగస్టు 12 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మర్ ఖాన్ పేట పాఠశాల లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సంద ర్భంగా బుధవారం రోజున పాఠశాల లో ఆటల పోటిలను గ్రామ సర్పంచ్ ఇరుగురాల మహేష్ ప్రారంభించడం జరిగింది. విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగా లను స్మరించుకుంటూ, పిల్లలలో క్రీడా స్ఫూర్తిని, దేశభక్తిని పెంపొందించ డమే ఈ పోటీల లక్ష్య మన్నారు విజేతలకు ప్రైజ్ లు సర్పంచి సొంత ఖర్చుల తో ఇవ్వడం జరుగు తుందని గ్రామ సర్పంచ్ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ ఉప సర్పంచ్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

**- విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు**




జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాకలం)

జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ మీటింగ్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో కలిసి జిల్లాలోని నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, చార్జ్‌షీట్లు, ట్రాఫిక్ అమలు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారుల భద్రత తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, నమోదైన కేసులను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం అందించేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు.

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో పాటు పటిష్టమైన సాక్ష్యాధారాలను సేకరించాలని, పెండింగ్ కేసులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరగా పరిష్కరించడంతో పాటు కోర్టుల్లో కన్విక్షన్ రేట్ పెంచేలా కృషి చేయాలని ఆదేశించారు.

మహిళల భద్రత, మత్తుపదార్థాల నివారణ, చోరీల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పెంచి, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పి పోలీసులపై నమ్మకం పెంచేలా వ్యవహరించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు సైబర్ టీములు చురుగ్గా పనిచేయాలని సూచించారు.'సొసైటీ ఫర్ పబ్లిక్ సేఫ్టీ'లో భాగంగా పట్టణాల్లోని కాలనీలు, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు.

ముఖ్యంగా పోక్సో, గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సకాలంలో కోర్టుల్లో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

విద్యాసంస్థలు, యువత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

భూవివాదాలు, పాత కక్షల నేపథ్యంలో నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై అవసరమైతే కొత్తగా రౌడీషీట్లు తెరవాలని ఎస్పీ సూచించారు.

**ఉత్తమ ప్రతిభకు ప్రశంసలు**

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, శ్రీనివాస్, కరుణాకర్, రాజ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వేణు, సైదులు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# టెండర్ గడువు ముగిసిన షాపులపై ఉక్కుపాదం

**ఐదుసార్లు నోటీసులిచ్చినా స్పందన కరువు - ప్రభుత్వ కళాశాలలో షాపింగ్ కాంప్లెక్స్ సీజ్**




పెద్దపల్లి,ఆగస్టు12:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నెలకొన్న షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలపై యంత్రాంగం ఉక్కుపాదం మోపింది.టెండర్ గడువు ముగిసినప్పటికీ,ఎలాంటి అనుమతులు లేకుండా,దుకాణాలను ఖాళీ చేయకుండా కొనసాగిస్తున్న యజమానులపై కళాశాల యాజమాన్యం కఠిన నిర్ణయం తీసుకుంది.నిబంధనలను ఉల్లంఘించిన మొత్తం 25 షాపుల షట్టర్లను అధికారులు ఎట్టకేలకు సీజ్ చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలోని ఈ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను గతంలో నిబంధనల ప్రకారం టెండర్ విధానంలో వ్యాపారులకు కేటాయించారు.అయితే,గత ఏడాది మార్చి 31తోనే ఈ షాపుల లీజు అగ్రిమెంట్ గడువు అధికారికంగా ముగిసింది.గడువు పూర్తయిన తర్వాత దుకాణాలను ఖాళీ చేసి కళాశాల యాజమాన్యానికి అప్పగించాల్సి ఉండగా,పలువురు యజమానులు మాత్రం వాటిని ఖాళీ చేసేందుకు ససేమిరా అన్నారు.ఎలాంటి పొడిగింపు ఆదేశాలు లేనప్పటికీ యథావిధిగా వ్యాపారాలు కొనసాగించడం గమనార్హం.నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను కొనసాగిస్తున్న యజమానులకు కళాశాల, మున్సిపల్ అధికారులు సుమారు ఐదు పర్యాయాలు స్పష్టమైన నోటీసులు జారీ చేశారు.అయినప్పటికీ షాపుల యజమానుల నుంచి ఎలాంటి స్పందన కరువైంది. ప్రభుత్వ ఆస్తులను,విద్యా సంస్థల స్థలాలను ఇలా అక్రమంగా ఆధీనంలో ఉంచుకోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు.ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారుల ప్రత్యేక ఆదేశాల మేరకు అధికారులు పోలీసుల సహకారంతో సీజింగ్ ప్రక్రియను చేపట్టారు.ఈ దుకాణాల సీజింగ్ ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు,ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు.షాపింగ్ కాంప్లెక్స్ వద్ద భారీగా పోలీసులను మోహరించి పూర్తి బందోబస్తు నిర్వహించారు.ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు.నిర్ణీత టెండర్ గడువు ముగిసినా,పదే పదే హెచ్చరించినా దుకాణాలు ఖాళీ చేయని కారణంగానే అనివార్య పరిస్థితుల్లో ఈ చర్యలు చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపల్ రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు.సీజింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ దుకాణాల భవిష్యత్తు నిర్వహణ,కొత్త టెండర్ల ప్రక్రియపై అధికారులు తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. విద్యా సంస్థల పరిధిలోని ఆస్తులను పరిరక్షించేందుకు అధికారులు తీసుకున్న ఈ చర్యలపై స్థానికంగా చర్చనీయాంశమైంది.

## ధర్మపురిలో మైనారిటీ మహిళలకు సబ్సిడీ చెక్కుల పంపిని..



వెల్గటూర్, ఆగస్టు 12, ప్రజాకలం ప్రతినిధి :రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అమలు చేస్తున్న "ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన" పథకం కింద ధర్మపురి మండలంలో 39 మంది మహిళలు ఎంపిక కాగా, వారికి రూ. 19.50 లక్షల విలువగల చెక్కులను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురిలో గల తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అర్హులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం ద్వారా వితంతు వులు, విడాకులు పొందిన మహిళ లు, అనాథలు, నిరుపేదలు, ఒంటరి మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను ఏర్పరుచుకొని ఆర్థికంగా ఎదగాలని లబ్ధిదారులకు సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ఎరువుల పంపిణీలో నూతన విధానం

**- ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ**




ఎండపల్లి, ఆగస్టు 12 : ( ప్రజా కలం ప్రతినిధి ) నేటి నుండి "ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ జరుగుతుందని ఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ తెలిపారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా, సులభతరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా "ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ అనే నూతన డిజిటల్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఈ విధానంలో భాగంగా 2026 ఆగస్టు 13వ తేదీ నుండి ఎండపల్లి మండలంలోని రైతులకు ఎరువుల పంపిణీ పూర్తిగా ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే నిర్వహించబడు తుంది. ఇప్పటి వరకు అమ లులో ఉన్న విధా నానికి భిన్నంగా, ఇకపై రైతులు తమ సాగు అవ సరాలకు అనుగుణంగా ముందుగానే యాప్‌లో నమోదు చేసు కుని ఎరువు లను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రైతు వివరాలు, సాగు భూమి, పంట వివరాలు, అవసరమైన ఎరువుల సమాచారం ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రక్రియ జరుగు తుంది. దీనివల్ల రైతులకు అవసరమైన ఎరువుల ప్రణాళిక మరింత సమర్థ వంతంగా రూపొందించ బడటం తో పాటు పంపిణీ ప్రక్రియలో పార దర్శకత పెరుగు తుంది. ఎఫ్ఎఫ్ఎస్ యాప్ లో రైతులు ఎలా నమోదు చేసుకోవాలి? రైతులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకోవాలి. ఫార్మర్ ఐడి ఉన్న రైతులు ఫార్మర్ ఐడి లేదా ఆధార్ సంఖ్య ద్వారా లాగిన్ అయ్యి ఆధార్‌కు అను సంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటిపి ద్వారా తమ వివరాలను ధృవీకరించుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతు భూమి వివరాలు స్వయంచాలకంగా యాప్ లో అందుబాటులోకి వస్తాయి. ఫార్మర్ ఐడి రైతులు ఆధార్ సంఖ్య తో ఈ కేవైసీ పూర్తి చేసి, ఓటిపి ధృవీకరణ అనంతరం నమోదు ప్రక్రియను కొనసాగించవచ్చు.

భూమి వివరాలు కనిపించకపోతే ఏమి చేయాలి?

కొంతమంది రైతుల భూమి వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీ అందుబాటులో లేక పోవచ్చు. అలాంటి సంద ర్భాల్లో యాప్‌లో ఉన్న సైన్క్ లాండ్స్ విత్ ఫార్మర్ రిజిస్ట్రీ సదుపాయాన్ని ఉపయోగించి భూమి వివరాలను సమకాలీక రించు కోవచ్చు అయి నప్పటికీ భూమి వివరాలు అందుబాటులోకి రాకపోతే ఆడ్ క్లైమ్ ల్యాండ్ ద్వారా భూమి వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. ఇందులో రైతులు తమ యాజమాన్య హోదా లేదా సాగుదారునిగా సంబంధించిన వివరాలను నమోదు చేసి భూమి వివరాలను సమర్పించ వచ్చు.

పంట వివరాలు నమోదు తప్పనిసరి

భూమి వివరాలు నమోదు పూర్తయిన తర్వాత రైతులు ప్రస్తుత సీజన్‌లో సాగు చేయబోయే పంటను తప్పనిసరిగా ఎంపిక చేయాలి. అనంతరం ఏ భూమికి ఎరువులు అవ సరమో ఆ భూమిని ఎంపిక చేసి ఆయా పంటలకు అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేయాలి. యాప్‌లో భూమి విస్తీర్ణం మరియు ఎంపిక చేసిన పంట ఆధారంగా జనరల్ ఫర్టిలైజర్ రెకమండేషన్ జిపిఆర్ అందుబాటులో ఉంటుంది. రైతులు అవసరాన్ని బట్టి సూచించిన పరిమాణాన్ని లేదా తమ అవసరానికి అనుగుణంగా పరిమా ణాన్ని ఎంపిక చేసు కోవచ్చు.

**ఎరువుల బుకింగ్ - క్యూ ఆర్ కోడ్ విధానం**

రైతులు తమకు అను కూలమైన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎంపిక చేసిన తర్వాత దరఖాస్తు సమర్పిస్తే, యాప్‌లో క్యూఆర్, టోకెన్ నంబర్ రూపొందుతుంది. ఆ క్యూఆర్ ఆధారంగా రైతు లు ఎరువులను పొంద వచ్చు. రైతు స్వయంగా లేదా తాను అధీకరించిన వ్యక్తి ద్వారా కూడా ఎరువులు స్వీకరించే సౌకర్యం ఈ యాప్‌లో కల్పించబడింది.

రైతులకు కలిగే ప్రయోజనాలు ఈ నూతన విధానం ద్వారా రైతుల వివరాలు, సాగు భూమి, సాగు పంట ఆధారంగా ఎరువుల అవసరాన్ని ముందుగానే అంచనా వేయడం సులభ మవుతుంది. అలాగే ఎరువుల పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా సాగేందుకు అవకాశం కలుగుతుంది. రైతులు తమ దరఖాస్తు స్థితిని యాప్ ద్వారా తెలుసుకోవడంతో పాటు క్యూఆర్ ద్వారా సులభంగా ఎరువులు పొంద గలుగుతారు.

**రైతులకు మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి**

ఎండపల్లి మండలంలోని రైతులందరూ ఎరువుల అవసరం వచ్చిన తర్వాత కాకుండా, ముందుగానే ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు. ఫార్మర్ ఐడి, ఆధార్, మొబైల్ నంబర్, భూమి వివరాలు సిద్ధంగా ఉంచుకొని నమోదు పూర్తి చేసుకో వాలని ఎండపల్లి మండలం వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ సూచించారు. యాప్ వినియోగం లో ఏవైనా సందేహాలు లేదా నమోదు సంబంధిత ఇబ్బందులు ఎదురైనట్ల యితే, తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి ఏ ఈ ఓ లేదా ఎరువుల విక్రయ కేంద్రా లను సంప్రదించి అవస రమైన సహాయం పొంద వచ్చు రైతులు ఈ నూతన విధానాన్ని సద్వినియోగం చేసుకొని 2026 ఆగస్టు 13వ తేదీ నుండి అమలులోకి రానున్న ఎఫ్ ఎఫ్ ఎస్ విధానానికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కమల మహేష్ రైతుల విజ్ఞప్తి చేశారు.

# కన్నకొడుకే భూమిని కాజేశాడని
# వృద్ధ దంపతుల ఆవేదన

**-కన్నవారికే తెలియకుండా భూమిని సాదాబైనామాలో తన పేరున మార్చుకున్నాడని ఆరోపణ**

**-పోలీసులు, తహసీల్దార్, కలెక్టర్‌ను ఆశ్రయించినా ఫలితం లేదంటూ కన్నీటి పర్యంతం**

**- అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకోలు**

వర్ధన్నపేట, ఆగస్టు 12 (ప్రజాకలం ప్రతినిధి): కష్టపడి సంపాదించిన భూమిని తమ కన్న కొడుకే తమకు తెలియకుండా సాదాబైనామా ద్వారా తన పేరుపై





చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వృద్ధాప్య దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవితకాలంలో సంపాదించుకున్న ఆస్తిని కాపాడుకోవడానికి అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన బొంత లక్ష్మి, ఆమె భర్త సారయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు కష్టపడి సంపాదించిన డబ్బుతో 1011/E, 1011/B/2 సర్వే నంబర్లలోని భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే తమ పెద్ద కుమారుడు రమేష్ తమకు తెలియకుండా సాదాబైనామా ద్వారా సుమారు 1-30 గుంటల భూమిని తన పేరుపై చేసుకున్నాడని ఆరోపించారు.

**చిన్న కొడుకే ఆసరా..** వృద్ధాప్యంలో తమ ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడంతో చిన్న కుమారుడు తమకు అండగా ఉంటూ, వైద్య చికిత్సల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నాడని దంపతులు తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో తమకు చెందాల్సిన భూమిపై పెద్ద కుమారుడు హక్కు చెలాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. అధికారుల చుట్టూ తిరిగినా భూమి విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఇప్పటికే పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయం, జిల్లా కలెక్టర్‌ను సంప్రదించినట్లు వృద్ధ దంపతులు తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు తమ సమస్యకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**న్యాయం చేయాలని వేడుకోలు...** తమకు తెలియకుండా జరిగినట్లు చెబుతున్న భూ లావాదేవీపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. తమ వయసు, పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి భూమి విషయంలో న్యాయం చేయాలని వృద్ధాప్య దంపతులు వేడుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని తెలిపారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం.. కూలీకి తీవ్ర గాయాలు

-వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొని ఘటన

-క్షతగాత్రుడిని ఎంజీఎంకు తరలించిన స్థానికులు.. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ రాజు



ఆగస్టు 12, ప్రజాకలం ప్రతినిధి:(వరంగల్/వర్ధన్నపేట) వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోజువారీ కూలీ పనులు ముగించుకుని వస్తున్న ఓ వ్యక్తిని వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన వర్ధన్నపేట నుంచి వరంగల్ వైపు వెళ్లే మార్గంలో చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని రోడ్డుపై నుంచి సురక్షితంగా పక్కకు తరలించారు. అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు, కారు వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదంతో కొద్దిసేపు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా ప్రయాణిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు, పాదచారులు రహదారి దాటే ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చిన్నారుల హక్కులపై అవగాహన

గద్వాల ప్రతినిధి ఆగస్టు 12 ప్రజా కలం: చిన్నారుల హక్కులు, రక్షణ, ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో




జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎల్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సహాయ న్యాయ రక్షణ న్యాయవాది డి. లక్ష్మన్న స్వామి విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధం, బాల కార్మికుల నిషేధం, విద్యా హక్కు, బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నారులు వేధింపులకు గురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 బాలల సహాయవాణి, ఉచిత న్యాయ సహాయం కోసం 15100కు సంప్రదించాలని తెలిపారు. సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్‌ను జాగ్రత్తగా వినియోగించాలని, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరసింహ, కళాశాల ప్రిన్సిపాల్ జి. శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, బాలల సహాయవాణి, భరోసా కేంద్రం ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగారంలో ఎమ్మార్పీఎస్-ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీలు

**- నూతన తరం నాయకత్వంతో ఉద్యమాన్ని బలోపేతం చేయాలి**

**- ఎం. ఆర్. పి. ఎస్ ఐనవోలు మండల అధ్యక్షులు బరిగెల ఏలియ**



ఐనవోలు, ఆగస్టు 12:-(ప్రజాకలం ప్రతినిధి)

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఐనవోలు మండలం సింగారం గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీల ఎన్నికలు బుధవారం నిర్వహించారు. నూతన యువతరం నాయకత్వంతో సంఘాలను మరింత బలోపేతం చేసి, మాదిగ దండోరా ఉద్యమాన్ని గ్రామస్థాయిలో ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ఐనవోలు మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి బరిగెల ఏలియ మాదిగ, కో-ఇన్‌చార్జీలు కట్కూరి రమేష్ మాదిగ, ఇస్రాం బాబు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ సింగారం గ్రామ కమిటీ: అధ్యక్షుడిగా సింగారపు ఐలయ్య డక్కీ, అధికార ప్రతినిధిగా ఈదురు ప్రసాద్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా సింగారపు మధుకర్ మాదిగ, ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా సింగారపు ఏలియ మాదిగ, ఈదురు నగేష్ మాదిగ, సింగారపు భీమయ్య మాదిగ, ఈదురు ప్రతాప్ మాదిగ, తదితరులను ఎన్నుకున్నారు. ఎంఎస్పీ సింగారం గ్రామ కమిటీ: అధ్యక్షుడిగా సింగారపు పుల్లయ్య మాదిగ, అధికార ప్రతినిధిగా సింగారపు బాబు మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా ఈదురు ప్రవీణ్ మాదిగ, సింగారపు నగేష్ మాదిగ, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బరిగెల ఏలియ మాట్లాడుతూ నూతన యువతరం నాయకత్వంతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘాలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసి, మాదిగల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో గ్రామానికి చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు, మాజీ వికలాంగుల హక్కుల సంఘం అధ్యక్షులు, సింగరపు స్వామి యువత పాల్గొన్నారు.

# పాత్‌ఫైండర్ హైస్కూల్‌లో ఘనంగా కేబినెట్ ప్రతిష్ఠాపన

ఐనవోలు, ఆగస్టు 12:- (ప్రజాకలం ప్రతినిధి) విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో ఐనవోలు గ్రామంలోని పాత్‌ఫైండర్ హైస్కూల్‌లో కేబినెట్ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ డా. ఎన్. వెంకటేశ్వరరావు హాజరై విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు ధరింపజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్లు, ఇతర విద్యార్థి ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేసి తమ బాధ్యతలను స్వీకరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ సుభానుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి



చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. పాఠశాల డైరెక్టర్ డా. ఎల్.ఎన్. వెంకటేశ్వరరావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తరుణ్ మృతిపై న్యాయం చేయాలి

**- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**- ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేసిన విద్యార్థి సంఘాల నాయకులు**



గద్వాల ప్రతినిధి, ఆగస్టు 12 ప్రజా కలం:

విద్యార్థి తరుణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి, ఘటనకు బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు గద్వాల ఆర్‌డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జూలై 29న తరుణ్ తల్లిదండ్రులతో కలిసి ఆసుపత్రి ఎదుట ఉన్న ప్రధాన రోడ్డుపై ధర్నా నిర్వహించామని తెలిపారు. ఆ సమయంలో సంబంధిత లెక్చరర్‌ను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తామని నోడల్ అధికారి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇచ్చిన హామీని అమలు చేయకుండా సంబంధిత లెక్చరర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తరుణ్ మృతికి సంబంధించిన అంశంపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడానికి గల కారణాలను అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తరుణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్‌పల్లి రంగస్వామి, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కురవ పల్లయ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భరత్, కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పాగుంటలో మురుగు నీటి మడుగులు..

**- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం**

**- పారిశుధ్యం అస్తవ్యస్తం.. పంచాయతీ కార్యాలయం ముందే నీరు నిలిచినా పట్టించుకోని వైనం**

గద్వాల ప్రతినిధి ఆగస్టు 12 ప్రజా కలం:

కేటుదొడ్డి మండలంలోని పాగుంట గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలోని రోడ్లపై మురుగు నీరు, వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో రోడ్లు మడుగులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా పంచాయతీ కార్యాలయం ముందే నీరు నిలిచినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీరు ముందుకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగునీరు ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు పెరిగి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామసభలో ప్రస్తావించినా స్పందన కరువు**

రోడ్లపై నిలిచిన మురుగు నీటి సమస్యను గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామసభలో వార్డు సభ్యులు సైతం సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు.



**పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్**

వర్షాకాలంలో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురికాకుండా వెంటనే నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి ఫాగింగ్ చేయడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## గుడి నిర్మాణ పనులను పరిశీలించిన మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి



(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 12, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండలం రోల్లకల్ గ్రామం చెరువు ముందు తండా లో నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణ పనులను పరిశీలించి, బెడ్ పోసే కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ దేవి మంగ్య నాయక్ తో కలిసి టెంకాయ కొట్టి ప్రారంభించిన మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటి కార్యదర్శి బొట్ల మహేంద్ర, మండల ఎస్ సి సెల్ అధ్యక్షులు నరుకుడు రవీంధర్, కందికట్ల భాస్కర్, ఉప సర్పంచ్ కొత్తూరు ప్రశాంత్, మాజీ ఉప సర్పంచ్ సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు ధనంజయ్ శ్రీకాంత్, మోహన్, భాస్కర్ తధితరులు పాల్గొన్నారు.

## పెన్షన్లు, రేషన్ కార్డులపై అధికారుల సమీక్ష

**పంచాయతీ కార్యదర్శులకు కీలక సూచనలు: మండల ప్రత్యేక అధికారి జగ్గు నాయక్**

ప్రజా కలం ఆగస్టు 12 గద్వాల ప్రతినిధి:



జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి జగ్గు నాయక్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు, పాఠశాల విద్యార్థుల దుస్తులు, సెన్ సెస్, ఎస్ఐఆర్, ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) పనులతో పాటు ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి, వ్యవసాయ అధికారి కే. రాజశేఖర్, ఎంపీఓ జాకీర్, ఎమ్మార్వో ఝాన్సీ రాణి, ఏఈ (ఆర్‌డబ్ల్యూఎస్) పరమేష్, ఏపీఎం బిస్మం నాయుడు, ఏపీవో సుజాత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు కు 10 లక్షల విరాళం అందజేసిన ఎమ్మెల్యే

**- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ను సన్మానించిన విగ్రహ కమిటి సభ్యులు**

నిర్మల్ ఆగస్టు 12(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

భైంసా లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు కు 10 లక్షల



రూపాయల విరాళాన్ని లిఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మంగళవారం తన నివాసంలో విగ్రహ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ ను శివాజీ మహారాజ్ విగ్రహ కమిటీ సభ్యులంతా కలిసి శాలువాతో గజమాలతో ఘనంగా , సత్కరించారు. బైంసా ప్రజల ఎన్నో ఏళ్ల కోరిక శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటులో పెద్ద మొత్తంలో సహకరించినందుకు ధన్యవాదములు తెలిపారు. తాను ఇచ్చిన మాట ప్రకారం సొంతంగా 10 లక్షల రూపాయలు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి తోపాటు కౌన్సిలర్, నాయకులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తితోనే విజయాలకు బాటలు

**గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్**




ప్రజా కలం ఆగస్టు 12 గద్వాల ప్రతినిధి:జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం వీరాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ కె. రాజు ఆధ్వర్యంలో బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ హాజరై వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం చూస్తుంటే తన బాల్యంలోని ఆటలు గుర్తుకొస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి, రామకృష్ణ, తేజ, నాగరాజు, అయ్యస్వామి, రవిప్రకాష్, ఎస్. కిషోర్, పీఈటీలు అనిత, భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐదవ వార్డు బూత్ కార్యదర్శిగా పానుగోత్ దల్ సింగ్

**- ఎన్నిక నిర్వాహకులు పిసిసి అబ్జర్వర్ ఆఫీస్ ఖాన్**

మరిపెడ ప్రజకలం న్యూస్ ఆగస్టు 12 మరిపెడ మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ బూత్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది ఇందులో భాగంగా ఐదవ వార్డ్ కమిటీ అధ్యక్షుడిగా బోడ రవి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు బూత్ కార్యదర్శిగా పానుగోత్ దల్ సింగ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అనంతరం బల్సింగ్ మాట్లాడుతూ కష్టపడ్డందుకు ఫలితం దక్కింది అన్నారు కాంగ్రెస్ పార్టీ గుర్తించి నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు పార్టీకి కష్టపడి పనిచేసి మంచి పేరు



తీసుకొస్తాను అన్నారు నన్ను నమ్మి నాపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రన్ నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ ఎన్నికకు సహకరించిన ఆఫీస్ ఖాన్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి వైస్ చైర్ పర్సన్ రవీందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు రామ్లాల్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు



## ఎల్కల్ పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్పెట్లు బహూకరణ.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 12.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని ఎల్కల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ సహకారంతో రెండు కార్పెట్లను బహూకరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ కుమార్ స్వామి, ఏరియా కోఆర్డినేటర్ పరమేశ్వర చారి, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ స్కూల్ సపోర్టర్ ఏ.మల్లేష్ గౌడ్, ఎల్కల్ డైరెక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ రేపటి దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో కూడా తమ సహాయ సహకారాలు కొనసాగిస్తామని తెలిపారు. అలాగే పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్‌ను కూడా అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగభూషణం, ఉపాధ్యాయులు నరసింహ, నరేష్, కరుణాకర్, అండాలు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధల నడుమ ముగిసిన ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర

వేములవాడ, ఆగస్టు 12 ( ప్రజా కలం ప్రతినిధి) : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో నాలుగు రోజులుగా నిర్వహించిన బోనాల జాతర మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా ముగిశాయి, చివరి రోజు కావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు,ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారితో పాటు శ్రీ ప్రత్యంగిరా, శ్రీ భగలాముఖి అమ్మవార్లకు వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు,అనంతరం పుష్పాభిషేకం, విశిష్ట హోమాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. హోమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది, ఉత్సవాల ముగింపు వేడుకలకు మహిళలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు,భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ దంపతులు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు, నాలుగు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన బోనాల మహోత్సవాలకు సహకరించిన అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, న్యాయవాది కందుల క్రాంతికుమార్ దంపతులు, అమ్మవారి సేవకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జలసిరి పనులు వేగవంతం చేయాలి

**- నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు**

**- అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్:కే.హైమావతి**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి:12 ఆగస్టు ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లాలో జలసిరి పనులను వేగవంతంగా పూర్తి చేసి అభివృద్ధిలో ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జలసిరి, ఇతర అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జలసిరి కార్యక్రమం లక్ష్య సాధనలో జాప్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, ఫార్మ్ పాండ్‌లు, కమ్యూనిటీ పాండ్‌ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.రైతులకు విస్తృత అవగాహన కల్పించి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.అన్ని ప్రభుత్వ భవనాలపై రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను ప్రాధాన్యతతో చేపట్టాలని, ఎంపీడీఓలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కల నాటే కార్యక్రమాన్ని వారంలోగా పూర్తి చేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల ఫొటో అప్‌లోడ్ ప్రక్రియను గురువారం నాటికి 100 శాతం పూర్తి చేయాలని,ప్రతి గ్రామంలో కమ్యూనిటీ సోక్‌పిట్, గ్రామపంచాయతీల్లో డంపింగ్ షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలు ఉన్న చోట తహసీల్దార్లతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి వెంటనే పరిష్కరించాలని సూచించారు.చేయూత పథకం కింద పెన్షన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి, సుమారు 17 వేల దరఖాస్తుల్లో అర్హులైన వాటిని వెంటనే అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓలు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అన్ని అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా పరిషత్ సీఈఓ రమేష్,ఎంపీడీఓలు,ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు..

## శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకున్న భక్తులు

మెదక్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 12 పెద్ద శంకరంపేట పట్టణంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు ఆలయ పురోహితుడు రుషిత్ పంతులు భక్తుల గోత్రనామాలపై పేర్లపై అర్చనలు చేశారు వచ్చినటువంటి భక్తులకు ప్రసాదాలు అందజేశారు ఈ సందర్భంగా ఆలయ పురోహితులు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల పుట్టినరోజులు ప్రత్యేక అర్చనలు చేస్తున్నట్టు చెప్పారు



# ఆగమ శాస్త్రం ప్రకారమే రాజన్న ఆలయ అభివృద్ధి

**- గర్భాలయం, మహామండపంలో ఎలాంటి మార్పులుండవు.**

**- శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు పనులు.**

**-భక్తులు అపోహలు నమ్మొద్దు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.**



**వేములవాడ, ఆగస్టు 12 (ప్రజా కలం ప్రతినిధి) :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను ఆగమ శాస్త్ర నిబంధనలు, ఆలయ ప్రాచీనత, భక్తుల మనోభావాలకు అనుగుణంగానే చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆలయ గర్భాలయం, మహామండపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చడం లేదని తేల్చిచెప్పారు. ఈ విషయంలో కొందరు చేస్తున్న ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని సూచించారు,ఆలయ అభివృద్ధి పనులపై స్పష్టత కోసం ఆది శ్రీనివాస్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకుల ప్రతినిధుల బృందం శృంగేరి దక్షిణామ్నాయ శ్రీ శారదా పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి, శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వాములను కలిసి వివరాలు సమర్పించింది. ఆలయ అభివృద్ధికి సంబంధించిన నమూనాలు, ఫొటోలు, ఇప్పటివరకు జరిగిన పనులు, చేపట్టనున్న నిర్మాణాలపై స్వామివారికి వివరించారు. దాదాపు గంటన్నరపాటు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

**గర్భాలయం..మహామండపం యథాతథం..**

ఆలయ అభివృద్ధిలో భాగంగా గర్భాలయం, మహామండపాన్ని తొలగించడం, మార్చడం లేదా వాటి విస్తీర్ణాన్ని పెంచడం వంటి ప్రతిపాదనలు ఏవీ లేవని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు, గతంలో ప్రకటించిన విధంగానే అవి యథాతథంగా ఉంటాయని తెలిపారు,గర్భాలయం, మహామండపాన్ని తొలగిస్తున్నారంటూ గత రెండు రోజులుగా కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై భక్తుల్లో నెలకొన్న అనుమానాలను శృంగేరి పీఠాధిపతుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు, ఆగమ శాస్త్రం, పీఠాధిపతుల సూచనలకు అనుగుణంగానే అభివృద్ధి పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు.

**శిఖరానికి కొత్త రూపు..**

ప్రస్తుతం ఉన్న ఆలయ శిఖరం 1973లో నిర్మించినదని, భవిష్యత్తులో బంగారు తాపడం చేసుకునే అవకాశం ఉండేలా శిఖరాన్ని శిలామయంగా నిర్మించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. భక్తులకు దూరం నుంచే శిఖర దర్శనం కలిగేలా ప్రస్తుత స్థాయి నుంచి సుమారు నాలుగు అడుగుల మేర ఎత్తు పెంచే ప్రతిపాదనపై ఆగమ, సాంకేతిక అంశాలను పరిశీలించి ముందుకు వెళ్లాలని శృంగేరి పీఠాధిపతులు సూచించినట్లు వివరించారు.

**రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు...**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి రూ.2 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు, గోదావరి పుష్కరాల కోసం రూ.1,000 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఇప్పటికే సుమారు రూ.250 కోట్ల మేర నిధులు కేటాయించామని, పనులు దాదాపు 55 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు, గతంలో రూ.50 కోట్లు, అనంతరం రూ.100 కోట్లు, తాజాగా రూ.99.40 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు ఆలయ అభివృద్ధి వనుల్లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొండా సురేఖతో పాటు అధికారులు, అర్చకులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

**శిలతోనే శిఖరం...**

ఆలయ అభివృద్ధికి సుమారు 4.80 లక్షల క్యూబిక్ అడుగుల శిల అవసరమవుతుందని అధికారులు వివరించినట్లు తెలిపారు, ఆలయ ప్రాచీనతను కాపాడుతూ, ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా శిలామయ నిర్మాణాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అనివెట్టి మండపాన్ని ఆధునికంగా నిర్మిస్తున్నామని చెప్పారు. గతంలో రేకుల షెడ్డు ఉన్న ప్రాంతంలో 20 అడుగులు, 24 అడుగుల విభాగాలతో మండప నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

**అపోహలు నమ్మొద్దు...**

శృంగేరి పీఠాధిపతులు ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి శుభప్రదంగా ఉన్నాయని, పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు,ఆలయ అభివృద్ధి విషయంలో భక్తులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు,ఆగమ శాస్త్రం, భక్తుల మనోభావాలు, శృంగేరి పీఠాధిపతుల సూచనలకు అనుగుణంగానే ప్రతి పనిని చేపడుతున్నామని స్పష్టం చేశారు.

**లిఖితపూర్వక సూచనలు..**

దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి వనులపై శృంగేరి పీఠాధిపతులతో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు, గర్భాలయాన్ని మార్చడం, విస్తీర్ణం పెంచడం, మహామండపాన్ని తొలగించడం లేదా మార్చడం వంటి ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు,శిఖరాన్ని శిలామయంగా నిర్మించి, ప్రస్తుత స్థాయి కంటే సుమారు నాలుగు అడుగుల మేర పెంచే అంశంపై పీఠాధిపతులు సూచనలు చేసినట్లు తెలిపారు, భూమి బలం...

## ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలి

**కేబినెట్‌లో సంస్కృతిక సారథి ఉద్యోగాల బిల్లుకు ఆమోదం తెలపాలి..**

**సిద్దిపేట జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్...**

సిద్దిపేట:12 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో నిర్వహించనున్న కేబినెట్ సమావేశంలో ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు న్యాయం జరిగే విధంగా సంస్కృతిక సారథిలో ఉద్యోగాల ప్రకటనకు సంబంధించిన బిల్లుకు ఆమోదం తెలపాలని సిద్దిపేట జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ కోరారు.రాష్ట్ర ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షులు దరువు అంజన్న, చైర్మన్ అనువోజు వెంకన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్,రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సిద్దిపేట జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షులు ఎర్రవల్లి శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కళాకారులు కీలక పాత్ర పోషించారని, ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కళాకారుల సేవలు మరువలేనివని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు కల్పించి,ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సంస్కృతిక సారథిలో ఉద్యోగాల ప్రకటనకు సంబంధించిన బిల్లును రానున్న కేబినెట్ సమావేశంలో ఆమోదించి, నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు, రాష్ట్ర కమిటీ సభ్యులు కుంచం శ్రీనివాస్, పిల్లిట్ల బుజంగం, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ చిన్నగుండవెల్లి, ఉపాధ్యక్షులు తునికి రాజు, పాకాల భూపతి, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్ దుబ్బాక, సంయుక్త కార్యదర్శులు బొల్లం రాజేష్, ధనరేఖ, ప్రచార కార్యదర్శి రాజు చిన్నగుండవెల్లి, కోశాధికారి రాజు కందకట్ల, సలహాదారులు పిల్లిట్ల శశిధర్, ఇనుప సురేష్, కమిటీ సభ్యులు విధుమౌళి, రేణుక, భాగ్య, బొల్లం శ్రీనివాస్, భికపతి తదితర ఉద్యమ నిరుద్యోగ కళాకారులు పాల్గొన్నారు.



## సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**ఈ నెల 15 న సంగారెడ్డికి ముఖ్యమంత్రిరాక .జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.**

సంగారెడ్డి, ప్రతినిధి ఆగస్టు 12 ( ప్రజా కలం):

సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, సీఎం రూట్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ప్రాంతాల్లో భద్రతా చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





### పరిశ్రమ నైపుణ్యాలకు

# గీతం పెద్దపీట..

## - ఆటోడెస్క్ నిపుణులతో విద్యార్థుల ప్రత్యక్ష శిక్షణ..

పటాన్‌చేరు,ఆగస్టు 12 (ప్రజా కలం) ప్రతినిధి

ఆధునిక ఇంజనీరింగ్ రంగానికి అవసరమైన పరిశ్రమ నైపుణ్యాలు,అనుభవపూర్వక అభ్యాసాన్ని విద్యార్థులకు అందించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా గీతం కోర్ ఇంజనీరింగ్ పాఠశాలలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆటోడెస్క్ ఫ్యూజన్ ఇన్‌సైడర్ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఆటోడెస్క్ పరిశ్రమ నిపుణులు విద్యార్థులకు ఆధునిక ఉత్పత్తి రూపకల్పన,ఇంజనీరింగ్ సాంకేతికతలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ సుజయ్ డిసౌజా నేతృత్వంలోని ఎనిమిది మంది నిపుణుల బృందం అధునాతన రూపకల్పన సాధనాలను ప్రదర్శించింది. విద్యార్థులకు మూడు వారాలపాటు రూపకల్పన,అనుకరణ, సాంకేతిక చిత్రలేఖనం,నమూనా చిత్రణపై ప్రాజెక్టులు ఇచ్చారు. ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందించనున్నారు. బరువులు మోయగల అస్థిపంజర సహాయక పరికరం, స్వయంచాలక నదీ శుభ్రత రోబో వంటి వినూత్న నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. కోర్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ రమేష్ వడ్డి,మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జయ ప్రకాష్ శ్రీవాస్తవ ఆటోడెస్క్ ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమాన్ని అధ్యాపకుడు డాక్టర్ వీరప్రతాప్ సమన్వయం చేశారు. విద్యార్థులు నిపుణులతో చర్చిస్తూ తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు..

# స్వాతంత్ర్య వేడుకలకు ఘన ఏర్పాట్లు

## - స్వాతంత్ర్య వేడుకలకు పటాన్‌చెరు సన్నాహాలు..

పటాన్‌చెరు, ఆగస్టు 12 (ప్రజా కలం) ప్రతినిధి

దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఆగస్టు 15న పటాన్‌చెరు డివిజన్‌లోని మైత్రి మైదానంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, కవాతు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం పటాన్‌చెరు ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో నియోజకవర్గ



పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని పాఠశాలలు వేడుకల్లో భాగస్వాములు కావాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతి పాఠశాలకు రూ.5 వేల నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించే పాఠశాలలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. దేశ స్వాతంత్ర్య ఘట్టాలు,భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా విద్యార్థుల కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు.

# విద్యార్థుల హక్కుల కోసం పోరాటమే ఏఐఎస్ఎఫ్ లక్ష్యం

గజ్వేల్:12 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని గజ్వేల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సర్గం రాజేష్ ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్గం రాజేష్ మాట్లాడుతూ,విద్యా వ్యవస్థలోని అవినీతిని ప్రశ్నిస్తూ విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని,నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రామనకర్ కనుగుల మాట్లాడుతూ, విద్యను వ్యాపారంగా మారుస్తున్న కార్పొరేట్ కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. విద్యార్థుల సమస్యలు,ప్రభుత్వ నిర్లక్ష్యంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని,ప్రతి క్యాంపస్‌లో ఏఐఎస్ఎఫ్ జెండా ఎగరేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కురకూల ప్రతాప్, సుధాకర్,కొడిమల్ల వివేకానంద,తుమ్మ సాయిచరణ్‌తో పాటు జిల్లా,మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్.

దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 12.

పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందిస్తున్నట్లు తొగుట సీఐ షేక్ లతీఫ్ తెలిపారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో అఖిల రాజ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత శిక్షణకు సంబంధించిన అర్హత పరీక్ష గోడపత్రికను రాయపోల్ ఎస్ఐ కె.మానసతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ షేక్ లతీఫ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాల సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు.

ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. కోచింగ్‌కు అభ్యర్థుల ఎంపిక కోసం ఆగస్టు 16న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5 నుంచి ప్రిలిమ్స్ పరీక్ష పూర్తయ్యే వరకు రెసిడెన్షియల్ కోచింగ్ కొనసాగుతుందని వెల్లడించారు. హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, కరీంనగర్, సంగారెడ్డి, రామగుండం, బోధన్, మహబూబ్‌నగర్, నిర్మల్, దుబ్బాక, రామాయంపేట తదితర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఆర్థిక స్థోమత లేక ప్రైవేట్ కోచింగ్ పొందలేని గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఈ అవకాశం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ఉన్న యువత ముందుకు వచ్చి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల రాజ్ ఫౌండేషన్ మండల అధ్యక్షులు సొక్కం స్వామి, ఆర్గనైజర్ శ్రవణ్ కుమార్, వాలీబాల్ స్వామి, బొల్లం రాజేష్, నర్సింగరావు, మల్లయ్య, శ్రీనివాస్, మోహన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ రైల్వే ఉద్యోగి కాంపల్లి నర్సింగ్‌రావుకు ఘన గౌరవం






మల్కాజిగిరి ఆగస్టు 12(ప్రజా కలం ప్రతినిధి)

దక్షిణ మధ్య రైల్వేలో టికెట్ చెకింగ్ విభాగంలో సుదీర్ఘకాలం సేవలందించిన రిటైర్డ్ సీటీఐ ఓల్డ్ సఫిల్ గూడా భరత్ నగర్ వాసి కాంపల్లి నర్సింగ్‌రావు సామాజిక సేవా రంగంలోనూ విశేష సేవలు అందిస్తూ 'దళిత రత్న' పురస్కారాన్ని అందుకున్నారు. అణగారిన, పేద, వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభ్యున్నతి కోసం ఆయన చేసిన నిస్వార్థ సేవలను గుర్తించి 2026 ఏప్రిల్ 5న ఈ ప్రతిష్టాత్మక పురస్కారంతో సత్కరించారు. 1990లో రైల్వే ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన నర్సింగ్‌రావు టీసీ/ఏడబ్ల్యుబీ,సీనియర్ టీటీఈ/పీఏయూ, హెచ్‌టీటీఈ/నేడ్, టీటీఐ/ఏకే, సీటీఐ/నేడ్ తదితర హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2016లో సీసీఎం స్క్వాడ్‌లో చేరి, సుదీర్ఘ సేవల అనంతరం 2025లో రైల్వే ఉద్యోగం నుంచి పదవీ విరమణ చేశారు. ఉద్యోగ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూనే సామాజిక సేవకు ప్రాధాన్యతనిచ్చిన నర్సింగ్‌రావు ఎలాంటి ప్రచారం, ప్రశంసలు ఆశించకుండా అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసినట్లు సహచరులు తెలిపారు. ఆయన సేవా కార్యక్రమాలను సమాజం గుర్తించి 'దళిత రత్న' పురస్కారంతో గౌరవించడం పట్ల టికెట్ చెకింగ్ విభాగం విశ్రాంత ఉద్యోగులు రిటైర్డ్ టిక్కెట్ చెకింగ్ విభాగం ఆత్మీయ సమ్మేళనంలో,సహచరులు సన్మానించి అభినందించి హర్షం వ్యక్తం చేశారు. రైల్వే ఉద్యోగిగా తన వృత్తి జీవితంలోనే కాకుండా సామాజిక సేవలోనూ ప్రత్యేక గుర్తింపు పొందిన నర్సింగ్‌రావు తమ టికెట్ చెకింగ్ సిబ్బంది కుటుంబానికి గర్వకారణమని పలువురు అభినందించారు. ఆయన మరింత కాలం సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

# సీసీ కెమెరాల 'సురక్ష నేత్రం'

## .. సిద్దిపేట జిల్లాకు భద్రతా కవచం

## - ఒక్కరోజే 330 సీసీ కెమెరాల ప్రారంభం..

## - సిద్దిపేట జిల్లాలో 1,400కు పైగా కెమెరాలతో నిరంతర నిఘా

## - సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్




గజ్వేల్ నియోజకవర్గం:12 ఆగస్టు ( ప్రజా కలం ప్రతినిధి)

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్,ఐపీఎస్ చేపట్టిన 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమం విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా ఒకేరోజు 330 సీసీ కెమెరాలను ప్రారంభించారు. దీంతో జిల్లాలో ఇప్పటివరకు ఏర్పాటు చేసిన కెమెరాల సంఖ్య 1,400కు పైగా చేరింది. గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న తిమ్మాపూర్, బండ మైలారం, గౌరారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలను సీపీ రష్మీ పెరుమాళ్ ప్రారంభించారు. చిన్న తిమ్మాపూర్‌లో 20 సీసీ కెమెరాలతో పాటు రెండు ఏఎన్‌పీఆర్ కెమెరాలు, బండ మైలారంలో 32, గౌరారంలో 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు మూడో కన్ను నేరస్తులను త్వరగా గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని సీపీ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కెమెరాల డీవీఆర్‌లను సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత. ఓటీపీ,బ్యాంకు వివరాలను ఎవరికీ చెప్పవద్దని, గుర్తుతెలియని లింకులు, నకిలీ ఏపీకే ఫైళ్లకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని, త్వరగా ఫిర్యాదు చేస్తే నగదును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యమే కీలకం: జిల్లాలోని అన్ని గ్రామాలు, కాలనీలు, ప్రధాన కూడళ్లు నిఘా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని సీపీ వెల్లడించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు,సీసీపీఎస్ ఏసీపీ రాజు,గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ మొగిలి, ములుగు ఎస్ఐ రఘుపతి, గౌరారం ఎస్ఐ ఆరోగ్యం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# డ్రగ్స్ నిర్మూలన, మహిళలపై దాడుల నివారణపై అవగాహన సెమినార్లు.

## సెమినార్లను విజయవంతం చేయాలి.

## తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానస.

దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 12.

డ్రగ్స్ నిర్మూలనతో పాటు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవగాహన సెమినార్లను విజయవంతం చేయాలని తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానస పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్ గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ వ్యాప్తంగా నిర్వహించనున్న "డ్రగ్స్ నిర్మూలన -- మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి" అనే అంశాలపై అవగాహన సెమినార్లకు సంబంధించి పోస్టర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ లతీఫ్, ఎస్ఐ మానస పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని అన్నారు. మహిళలపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు ఎస్ఎఫ్ఐ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలనతో పాటు మహిళలకు సురక్షితమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో డివిజన్ వ్యాప్తంగా సెమినార్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సుద్దాల వంశీ, కోనేరు ప్రవీణ్‌కుమార్, డివిజన్ నాయకులు, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరం.. దేశానికి బలం.

## - తిరంగా యాత్రలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపు..

పటాన్‌చెరు, ఆగస్టు 12 (ప్రజా కలం) ప్రతినిధి

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉంటూ దేశ



ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువజన వికాస సమితి ఆధ్వర్యంలో పటాన్‌చెరు మైత్రి మైదానంలో నిర్వహించిన తిరంగా యాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. జాతీయ జెండాలతో విద్యార్థులు,యువత,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో సందడి చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, ప్రతి పౌరుడు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, హనుమంత్‌రెడ్డి, నర్రా బిక్షపతి, వెంకటేష్, బల్వంత్, హమీద్, ధనరాజ్, షకీల్, కొండల్, టింకు, యువజన వికాస సమితి అధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# మల్కాజిగిరిలో పౌర పనులపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన

మల్కాజిగిరి ఆగస్టు 12(ప్రజా కలం ప్రతినిధి)

ప్రజలకు మెరుగైన పౌర సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం న్యూ మిర్జాల్‌గూడ, వేణాపాణి నగర్, యాదవ్ నగర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, రహదారుల నిర్వహణ, చెత్త సేకరణ,రోడ్డు ఆక్రమణలు,సీ అండ్ డీ వ్యర్థాలు,మ్యాన్‌హోళ్ల పరిస్థితి, పట్టణ పచ్చదనం తదితర అంశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో బీటీ రోడ్డు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లను ఆక్రమించి ఉన్న నిర్మాణాలు, అడ్డంకులను తొలగించాలని సూచించారు. సీ అండ్ డీ వ్యర్థాలు, పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే ఆటో ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత బలోపేతం చేయాలని, మ్యాన్‌హోళ్లను రోడ్డు స్థాయికి పెంచి ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. ఖాళీ ప్రదేశాలను శుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాంటర్ బాక్స్‌లను మరింత పటిష్టంగా ఏర్పాటు చేసి వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ లక్ష్మణ్, డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తాన్ ఈఈ, డీఈ, ఏఈలు,ఏసీపీ శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన,మెరుగైన వాతావరణం కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.





## మృతుని కుటుంబానికి మిత్ర బృందం ఆర్థిక సహాయం.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 12.

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబారస్ పూర్ గ్రామానికి చెందిన శేరుపల్లి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ముబారక్ పూర్ మిత్ర బృందం నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మిత్ర బృందం నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ బోటుక తిరుపతి, ఉప సర్పంచ్ కొంగరి రాజు, మాజీ ఎంపీటీసీ శేరుపల్లి స్వామి, న్యాలపల్లి లక్ష్మణ్, తుప్పతి నరేష్, జమాల్పూర్ సతీష్, పంజా రాజు, కోనేరు రాము, జక్కుల చందు, నిఖిల్ పాల్గొన్నారు.

# దేశంలోనే ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానం

### - డ్రాగన్ ఫ్రూట్ ఆయిల్ పామ్ తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన
### - బీహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా

మహేశ్వరం, ఆగస్టు 12,(ప్రజా కలం) దేశంలోనే ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని బీహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా అన్నారు. బీహార్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా బుధ వారం నాడు మహేశ్వరం మండలం మన్ సాన్ పల్లి గ్రామంలోని రైతు హనుమంత్ రెడ్డి పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డ్రాగన్ ఫ్రూట్ మరియు ఆయిల్ పామ్ తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రాగన్ ఫ్రూట్ లాభాలపై చర్చ డ్రాగన్ ఫ్రూట్ సాగులో వస్తున్న ఆదాయం, మార్కెట్ అవకాశాల గురించి రైతు హనుమంత్ రెడ్డి గారితో మంత్రి ముఖాముఖిగా మాట్లాడారు. తక్కువ నీటితో ఎక్కువ లాభం ఇచ్చే ఈ పంటను ఇతర రైతులు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్‌లో



తెలంగాణ నంబర్ 1 దేశంలోనే ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని మంత్రి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ రైతులకు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ పంట పట్ల రైతుల్లో ఉన్న అవగాహన, సాంకేతికతను స్వీకరించే తీరును చూసి మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ తరహా సాగును బీహార్ రాష్ట్రంలోనూ ప్రోత్సహించేందుకు తెలంగాణ మోడల్‌ను అధ్యయనం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహార్ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నర్మాదేశ్వర్,బీహార్ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ముకేశ్,అభిషేక్ బీహార్ ఉద్యానవన శాఖ డైరెక్టర్ అభిషేక్,తెలంగాణ ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ సరోజిని, డివిజనల్ ఉద్యానవన అధికారి సౌమ్య, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ మల్లేష్ రైతు హనుమంత్ రెడ్డి తన అనుభవాలను పంచుకుంటూ, ప్రభుత్వ సహకారంతో ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భన రెండు రాష్ట్రాల మధ్య వ్యవసాయ రంగంలో అనుభవాల పంచుకోలుకు, సహకారానికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## రాయపోల్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించిన తోగుట సిఐ లతీఫ్.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 12.

సురక్షా నేత్ర కార్యక్రమంలో భాగంగా రాయపోల్ గ్రామంలో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను తోగుట సీఐ లతీఫ్ బుధవారం



ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ లతీఫ్ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడే వ్యక్తులను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ప్రజల భద్రతను మరింత మెరుగుపరచడంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని తెలిపారు.అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ఎస్ఐ కె. మానస, గ్రామ సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

### - మాధవరం రంగారావు



కూకట్ పల్లి, ఆగస్టు 12, ప్రజా కలం ప్రతినిధి:

శేరిలింగంపల్లి నియోజక వర్గం గచ్చిబౌలి డివిజన్ లోని మల్కం చెరువు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాంగ్రెస్ -బీజేపీ ప్రభుత్వాలు లోపాయకారి ఒప్పందం తో అప్పనంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టినందుకు నిరసనగా బిఆర్ఎస్ ఎంఎల్ సి దాసోజు శ్రవణ్, ఎంఎల్ సి శంభీపూర్ రాజు, శేరి లింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మరియు వందలాదిమంది బిఆర్ఎస్ నాయకులతో కలిసి స్థలం వద్ద నిరసన తెలిపిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పీఎం ఏక్తా మాల్ కి ఈ స్థలాన్ని కేటాయించడం జరిగిందని, దీనికి రెండు వందల కోట్లు రూపాయలు కూడా ఫ్రీ ఇంట్రెస్ట్ ద్వారా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పీఎం ఏక్తా మాల్ యొక్క ముఖ్య ఉద్దేశం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో తయారయ్యే స్థానిక ఉత్పత్తులు చేనేత హస్తకళలు, సాంప్రదాయ కలలకు ఒకే వేదికను కల్పించాలనె ఉద్దేశంతో ఈ మాల్ ని నిర్మించాలని ఆరోజు నిర్ణయం తీసుకోవడం జరిగింది. కానీ ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిని ప్రైవేట్ సంస్థలైనటువంటి అపర్ణ, వంశీరామ్ బిల్డర్స్ కి చాలా తక్కువ పర్సంటేజ్ రుసుముతో వారికి అప్పజెప్పడం జరిగిందని, ఇది చాలా దారుణమైన చర్యగా భావిస్తూ దీనిని సిబిఐ విచారణకి అప్పగించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం 200 కోట్లు మంజూరు చేసి ఇప్పుడు రేవంత్ రెడ్డి చేసినటువంటి కార్యక్రమాన్ని అడ్డుకోకుండా, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తున్నారని, ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చున్నారని అన్నారు. సిబిఐ చేత విచారణ చేపించి తెలంగాణ ప్రజల చేనేత, హస్తకళలా, సాంప్రదాయాలకు సంబంధించిన వారికి తగిన న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, నవతారెడ్డి, సీనియర్ నాయకులు పురుషోత్తం యాదవ్, గొట్టుముక్కుల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, హరీష్ రావు, రవి యాదవ్, సతీష్ రావు, శ్రీనివాస్ గౌడ్, రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడబ్ల్యూ జెఎఫ్ యూనియన్ నాయకులు

కూకట్ పల్లి, ఆగస్టు12, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్పల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) రితీరాజ్ ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ కూకట్ పల్లి యూనియన్



నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీ రితిరాజ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూనే చట్టాన్ని ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాలను అరికడతామని , దానితో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈ వ్ టీజింగ్ కు పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఆపద సమయంలో డయల్ 112 నెంబర్ కు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని పొందాలని ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని డిసిపి మాట్లాడారు. అనంతరం కూకట్ పల్లి కమిటీకి నూతనంగా ఎన్నికైన సభ్యులను అభినందించారు. సందర్భంగా ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి టి డబ్ల్యూ జె ఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు, ఉపాధ్యక్షులు బొమ్మ గోపి, కోశాధికారి మహమ్మద్ షబ్బీర్, కార్యవర్గ సభ్యులు నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు టీజేఏ వినతి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి:**
**12 ఆగస్టు ( ప్రజా కలం ప్రతినిధి)**

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీజేఏ) సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. టీజేఏ జిల్లా అధ్యక్షుడు సొల్లేటి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎన్.రాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టీజేఏ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు నిరంతరం కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నప్పటికీ జిల్లాలో పలువురు జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేవని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం తరఫున ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం విద్యా రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు అత్యవసర వైద్య పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులతో ప్రత్యేక వైద్య సేవల సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల కుటుంబాలకు వైద్య భద్రత కల్పించేందుకు ప్రత్యేక ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఆర్టీసీ బస్ పాస్ రాయితీ విషయంలో ప్రస్తుతం కొన్ని రూట్లలో 1/3 రాయితీ, మరికొన్ని సందర్భాల్లో 1/2 రాయితీ అమలవుతున్న వ్యత్యాసాన్ని తొలగించి, రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులందరికీ ఒకే విధంగా 1/3 రాయితీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రాయితీని జిల్లాలో పనిచేస్తున్న కాన్స్టిట్యూయెన్సీ రిపోర్టర్లకు కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం, జర్నలిస్టు సంఘాలు, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని టీజేఏ ప్రతినిధులు కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి అవసరమైన చర్యలను జిల్లా స్థాయిలో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి సానుకూలంగా స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి, తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఏ సిద్దిపేట జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు వంగ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్. గణేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ, భాష వేణి, లింగమూర్తి, ట్రెజరర్ సిహెచ్. మహేందర్, ఎస్. భాస్కర్ రెడ్డి, లింగాల బాబు, గుడి భాను, అంబడిపల్లి ఈశ్వర్, గౌస్ పాషా, ఇంతియాజ్ ఉద్దీన్ పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో బోనాల జోష్..

### పలారం బండ్ల సందడి..
### -పటాన్‌చెరులో ఘనంగా
### బోనాల పలారం బండి ఊరేగింపులు..

పటాన్‌చెరు, ఆగస్టు 12 (ప్రజా కలం) ప్రతినిధి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల వేడుకలు పటాన్‌చెరు, ఇస్నాపూర్ ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. పలారం బండి ఊరేగింపులు ఉత్సాహంగా సాగాయి. ఇస్నాపూర్‌లో కౌన్సిలర్ మన్నే రాఘవేంద్ర ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్, పటాన్‌చెరు ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పటాన్‌చెరులో యాదవ, ముదిరాజ్ సంఘాలు, గోకుల్ యువజన సంఘం, గోనెమ్మ బస్తీ, జూనియర్ బాయ్స్ యువజన సంఘం, వివిధ కాలనీల ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపుల్లో నీలం మధు పాల్గొన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు నీలం మధు తెలిపారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహ రెడ్డి నివాసంలో తేనీటి విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, కాసాని వీరేష్, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, సంగన్నగారి గోపాల్, దస్తగిరి, సంపత్ రెడ్డి, వెంకటేష్ నాయక్, సందీప్ గౌడ్, నారాయణదాసు, మణికంఠతో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.



## ఘనంగా మౌలాలిలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం




మల్కాజిగిరి,ఆగస్టు 12, (ప్రజా కలం ప్రతినిధి )

దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో పనిచేసిన టికెట్ చెకింగ్ విభాగం(టిసి) రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం మౌలాలిలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరై ఒకరినొకరు ఆత్మీయంగా కలుసుకున్నారు. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఒకే క్యాడర్‌కు చెందిన టికెట్ చెకింగ్ విభాగం విశ్రాంత ఉద్యోగులు తొలిసారిగా ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడం విశేషమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు తమ పాత సహచరులను కలుసుకుని ఉద్యోగ జీవితంలోని మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చాలాకాలం తర్వాత మిత్రులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ సమ్మేళనం మానసిక ప్రశాంతతతో పాటు ఆత్మీయ అనుభూతిని కలిగించిందని వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ విశ్రాంత ఉద్యోగులు వెంకట్రావు, వి.ఎన్.పురానిక్, ఏ. రాజగోపాల్‌ను కమిటీ సభ్యులు ఆర్.సి.ఎన్. రాజు, ఎం.నాగరావు, టి. రామకృష్ణ, ఎం.శ్రీనివాస్, కె.బి.మురళీమోహన్, కె. నర్సింగరావు, బి. భీమయ్య లు ఘనంగా సన్మానించారు. ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు హాజరైన రిటైర్డ్ ఉద్యోగులు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి పాత సహచరుల మధ్య స్నేహబంధాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.

# క్రషర్ ఏర్పాటుకు అనుమతులు రద్దు చేయాలి

వలిగొండ ఆగస్టు 12 ప్రజాకలం:క్రషర్ మిషన్ ఏర్పాటు అనుమతులు రద్దు చేయాలని,యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్ పురం గ్రామ రైతులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.గ్రామంలోని పెద్ద గుట్ట వద్ద క్రషర్ మిషన్ ఏర్పాటుకు గ్రామ పంచాయతీ పాలక వర్గం తీర్మానం చేసి అనుమతులు ఇవ్వడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్న ప్రాంతంలో,పరిశ్రమల




ఏర్పాటుతో దుమ్ము ధూళి కారణంగా వ్యవసాయ భూములు సేద్యానికి పనికిరాకుండా పోయి ప్రజలు అనారోగ్యం బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామస్థుల రైతుల అభ్యంతరాలు పట్టించుకోకుండా క్రషర్ కు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు.గ్రామంలో ఇప్పటికే మూడుసార్లు సభలు నిర్వహించి క్రషర్ మిషన్ వద్దని గ్రామ ప్రజలు,రైతులు స్పష్టంగా వ్యతిరేకించినప్పటికీ,తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా,గ్రామ పంచాయతీ పాలకవర్గం అనుమతి ఇవ్వడం ఏమిటని రైతులు నిలదీశారు.పశువుల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుందని,పంట పొలాలే తమ జీవనాధారమని,రైతుల అభ్యంతరాలను పట్టించు కోకుండా అనుమతి ఇవ్వడం సరికాదని,రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎలిమినేటి జంగారెడ్డి,శ్రీశైలం రెడ్డి,సత్తిరెడ్డి,సునీత, మల్లారెడ్డి,కలమ్మ,వెంకట్ రెడ్డి,విమల,మోహన్ రెడ్డి,పద్మ, శ్రీనివాస్ రెడ్డి,అంజమ్మ,బుచ్చి రెడ్డి,లక్ష్మి,రమేష్, బాలనర్సమ్మ,పల్లపు అంజమ్మ,శ్రీను కనకమ్మ,సత్తిరెడ్డి,వెంకట్ రెడ్డి,జంగారెడ్డి,కిరణ్ రెడ్డి,దుర్గమ్మ,సరిత,శారద,స్వామి, మల్లమ్మ, రాములు,యాదయ్య,జలంధర్ రెడ్డి,అండమ్మ,లక్ష్మమ్మ,నరేష్,లక్ష్మమ్మ,ఏనుగు లింగారెడ్డి,పల్లపు నరసింహ,మంగమ్మ తదితర రైతులు పాల్గొన్నారు.

# భాజపా ఆధ్వర్యంలో తిరంగ ర్యాలీ

వలిగొండ ఆగస్టు 12 ప్రజాకలం:మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు విద్యార్థులతో కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు.తిరంగా ర్యాలీలో పలువురు




మాట్లాడుతూ తిరంగా ర్యాలీ దేశ ప్రజల యొక్క ఐక్యతను తెలియజేస్తుందని,ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు నేటి బాలలే రేపటి పౌరులని వారందరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని,దేశ ఔన్నత్యం కోసం ప్రతి ఒక్క భారతజాతి బిడ్డ పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ ఏలే చంద్రశేఖర్,వలిగొండ సర్పంచ్ శ్రీ వెంకట పాపిరెడ్డి,బీసీ సంఘం నాయకులు సాయిని యాదగిరి,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు యాదగిరి, బిజెపి సీనియర్ నాయకులు రాచకొండ కిష్టయ్య,కనతాల అశోక్ రెడ్డి,బందారపు రాములు,రాస వెంకట్,జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామనర్స్,జిల్లా నాయకులు బచ్చు శ్రీనివాస్,మైసొల్ల మచ్చగిరి,నాగరాజు,రంజిత్ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి లింగస్వామి గౌడ్,మండల కార్యదర్శిలు వెంకటేశం, మహేష్,శ్రీనివాస్,మండల నాయకులు నరసింహ, రామచంద్రం,చిన్న మచ్చగిరి, పెద్ద కిట్టు,వెంకటేశం, జంగయ్య,వివిధ గ్రామాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రావిరాలలో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు వైభవంగా ముగింపు

### - గ్రామ ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహణ

### - ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల రమేష్

మహేశ్వరం, ఆగస్టు 11 (ప్రజా కలం):

మహేశ్వరం మండలం, తుక్కుగూడ జీహెచ్ఎంసి పరిధిలోని రావిరాల గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా రావిరాల, జెన్నాయిగూడ, కొంగర కుర్దు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల రమేష్ మాట్లాడుతూ, బోనాల ఉత్సవాలను విజయవంతం చేయడంలో గ్రామ ప్రజలు, ముదిరాజ్ సంఘం సభ్యులు అందించిన సహకారాన్ని కొనియాడారు. పెద్దమ్మ తల్లి ఆశీర్వాదంతో ఈ ఏడాది బోనాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా ఘనంగా నిర్వహించగలిగాం. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు" అని ఆయన అన్నారు.రాబోయే రోజుల్లోనూ గ్రామ అభివృద్ధి కార్యక్రమాలన్నీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతోనే కొనసాగిస్తామని, ముఖ్యంగా పెద్దమ్మ తల్లి దేవాలయ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తామని ఆకుల రమేష్ స్పష్టం చేశారు. ఉత్సవాల్లో మహిళలు బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.



# క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ,పట్టుదల ఎంతో అవసరం

### - అదనపు డీసీపీ మహమ్మద్ బుర్హాన్ అలీ,ఏసీపీ జి. రణవీర్ రెడ్డి చేతుల మీదుగా జివిఆర్ కరాటే విజేతలకు ఘన సన్మానం

హైద్రాబాద్ ఆగస్టు 12(ప్రజాకలం న్యూస్) బెంగళూరులో నిర్వహించిన కరాటే టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జివిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. జివిఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అభినందన కార్యక్రమానికి అదనపు డీసిపి మహమ్మద్ బుర్హాన్ మల్కాజ్‌గిరి సిటీ పోలీస్,జి.రణవీర్ రెడ్డి,ఏసీపీ, చిక్కడపల్లి డివిజన్, హైద్రాబాద్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు,సర్టిఫికెట్లు అందజేశారు. బెంగళూరు కరాటే టోర్నమెంట్‌లో జివిఆర్ కరాటే అకాడమీకి చెందిన 24 మంది విద్యార్థులు పాల్గొని 38 ప్రథమ స్థానాలు,10 ద్వితీయ స్థానాలు సాధించడం విశేషం.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముఖ్య అతిథులు అభినందించి, క్రీడా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మహమ్మద్ బుర్హాన్ అలీ మాట్లాడుతూ బెంగళూరు టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జివిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో




రాణించేందుకు క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఏసీపీ శ్రీ జి. రణవీర్ రెడ్డి మాట్లాడుతూ జివిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు సాధించిన విజయాలు అభినందనీయమని అన్నారు. యువత క్రీడలు విద్యపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా మద్యం ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని,వాటి వల్ల ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరించారు. కరాటే వంటి క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం,శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు సాధించిన విజయాలతో ఆగిపోకుండా మరింత కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మిషన్-80 విజేత సుధాకర్‌కు ప్రత్యేక సత్కారం ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్, జివిఆర్ కరాటే అకాడమీ విద్యార్థి వి.సుధాకర్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. ఇటీవల నిర్వహించిన "మిషన్-80" వరల్డ్ రికార్డ్ అటెంప్ట్‌లో 80 షాబాద్ టైల్స్‌ను 9 విభిన్న కరాటే టెక్నిక్స్‌తో కేవలం 3 నిమిషాల 6 సెకన్లలో బ్రేక్ చేసి,నిర్ణయించిన 8 నిమిషాల సమయాన్ని అధిగమించిన సుధాకర్‌ను ముఖ్య అతిథులు అభినందించారు. సుధాకర్ సాధించిన ఈ విజయాన్ని అతిథులు ప్రశంసిస్తూ ఇది కఠినమైన సాధన, శారీరక దృఢత్వం, పట్టుదల,ఏకాగ్రత, కరాటే నైపుణ్యాలకు నిదర్శనమని పేర్కొన్నారు. యువతకు సుధాకర్ వంటి క్రీడాకారులు స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రులు, కోచ్‌లు అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని జివిఆర్ కరాటే అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

కరాటే శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం,శారీరక దృఢత్వం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందించడమే అకాడమీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ప్రోత్సహించిన మహమ్మద్ బుర్హాన్ అలీ,జి.రణవీర్ రెడ్డిలను అకాడమీ తరఫున ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జివిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, బ్లాక్ బెల్ట్‌లు, కోచ్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడబ్ల్యూ జెఎఫ్ యూనియన్ నాయకులు

### - నూతన కార్యవర్గ సభ్యులను అభినందించిన డీసీపీ.

కూకట్పల్లి, ఆగస్టు 12 (ప్రజా కలం ప్రతినిధి)

కూకట్పల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఐజా) రితీరాజ్ ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూనే చట్టాన్ని ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాలను అరికడతామని , దానితో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈ వ్ టీజింగ్ కు పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఆపద సమయంలో డయల్ 112 నెంబర్ కు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని పొందాలని ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని డిసిపి మాట్లాడారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూ జెఎఫ్ కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య మాట్లాడుతూ కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ ప్రస్తుతం తెలంగాణ పోలీస్ శాఖలో కఠినంగా విధులు నిర్వర్తించే అధికారిణిగా గుర్తింపు పొందారని, ఆమె స్వస్థలం బీహార్ రాష్ట్రం పాట్నాలో పెరిగిన రితిరాజ్ ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి అయిన రితిరాజ్ తెలంగాణ కేడర్‌కు ఎంపికయ్యారు. హైదరా బాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన తర్వాత పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీగా పనిచేసిన సమయంలో ఎన్నికల సమయంలో శాంతిభద్రతల నిర్వహణలో ఆమె కీలక పాత్ర పోషించారాని, పోలీసు సంక్షేమ కార్యక్రమాల్లో కూడా చురు కుగా వ్యవహరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి టి డబ్ల్యూ జె ఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు ( జనరల్ సెక్రటరీ), ఉపాధ్యక్షులు బొమ్మ గోపి, కోశాధికారి మహమ్మద్ షబ్బీర్, కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్, నవీన్ కుమార్, సైదులు, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగు శివకృష్ణ చొరవతో దివ్యాంగునికి కృత్రిమ కాలు



కూకట్ పల్లి, ఆగస్టు 12, ప్రజా కలం ప్రతినిధి:

గజ్వేల్ కు చెందిన సాయిలు ప్రమాదంలో తన ఎడమ కాలును కోల్పోయి చాలా కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూన్నారు. రోజువారీ పనులు చేసుకోవడంలో కూడా కష్టాలు పడుతున్న ఆయన పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ స్పందించి, సాయిలుకు అవసరమైన సహాయం అందించేందుకు కూకట్ పల్లిలో భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసతి కేంద్రం ట్రస్ట్‌ను సంప్రదించి, కృత్రిమ కుడి కాలు (ఆర్టిఫిషియల్ రైట్ లెగ్) అందేలా చర్యలు చేపట్టారు. శివకృష్ణ చొరవతో సాయిలుకు కృత్రిమ కాలు అందడంతో ఆయన జీవితంలో కొత్త ఆశలు చిగురించాయి. ఇకపై రోజువారీ పనులను మరింత సులభంగా నిర్వహించుకునే అవకాశం లభించింది. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ సమాజంలో ఇంకా అనేక మంది దివ్యాంగులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య, ఉపాధి, వైద్యం, వివాహం వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన భారత్ వికాస్ ట్రస్ట్‌కు వికలాంగుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి దివ్యాంగుడికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత అని మెరుగు శివకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి, ముఖ్య అతిథిగా న్యూ శక్తి దివ్యంగుల సంస్థ అధ్యక్షుడు సీనియర్ నాయకులు వెల్పుగొండ వెంకటస్వామి, శాంతి వికలాంగుల సంఘం గంటి భ్రమరాంబ, హాజరయ్యారు. అలాగే భారత్ వికాస్ ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర, మీడియా ప్రతినిధులు టెక్నీషియన్ రఘు, మధు, స్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బొమ్మలరామారం మండలంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్

బొమ్మలరామారం, ఆగస్టు 12 (ప్రజా కలం)

మండలంలోని మల్యాల, తిరుమలగిరి, బొమ్మలరామారం గ్రామంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్ నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి,పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు .లబ్ధి దారులందరూ తమ ఇండ్ల నిర్మాణాలను వీలైనంత త్వరగా



పూర్తి చేసుకోవాలని అన్నారు అనంతరం గ్రామంలో ఉన్న పూరి గుడిసెలను పరిశీలించారు మొదటి ప్రాధాన్యతగా పూరి గుడిసెలో, రేకుల రూములలో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు నూతనంగా వచ్చిన జీవో ప్రకారం ఇండ్ల నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు బేస్‌మెంట్ లెవెల్ (BL),బిలో బేస్‌మెంట్ లెవెల్ (BBL) దశల్లో ఉండి, ఇంకా పనులు ప్రారంభం కాని ఇండ్లను అధికారులు ప్రత్యేకంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా ఇండ్ల నిర్మాణాలను వెంటనే వేగవంతం చేయాలని ఆదేశించారు.వీటితో పాటు రూఫ్ లెవెల్ (RL),రూఫ్ కాస్ట్ (RC), సెంటరింగ్ లెవెల్ (CL) దశల్లో ఉన్న ఇండ్ల ప్రగతిపై ఆరా తీస్తూ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు ఈ సందర్భంగా బొమ్మలరామారం గ్రామ సర్పంచ్ కట్ట ఉమాదేవి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల చివరి విడత డబ్బులు రాకపోవడంతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని చీఫ్ ఇంజనీర్ దృష్టికి తీసుకురావడంతో చీఫ్ ఇంజనీర్ స్పందిస్తూ రానున్న రోజులలో సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు బొమ్మలరామారం గ్రామానికి ఇందిరమ్మ ఇల్లు ఎక్కువ మంజూరు చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ను సర్పంచ్ కోరారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ శ్రీరాములు,హౌసింగ్ ఏఈ రోహిత్,గ్రామ పంచాయతీ కార్యదర్శి హనుమంతు, గ్రామస్తులు పాల్గొన్నారు

# బొమ్మలరామారం నూతన మండల పంచాయతీ అధికారిగా టి.శశికళ

బొమ్మలరామారం, ఆగస్టు12 (ప్రజా కలం)

మండల పంచాయతీ అధికారిగా రోజున టి.శశికళ బుధవారం రోజున నూతన బాధ్యతలు స్వీకరించారు మండల పంచాయతీ అధికారి గా పనిచేసిన



శ్రీమాలిని బదిలీ చేయడం మండలంలో చర్చనీయంగా మారింది ఈ మధ్యకాలంలో అక్రమ వెంచర్లు, అనుమతి లేని కంపెనీలు,ఫంక్షన్ హాల్ ల పై ప్రత్యేక కథనాలు వచ్చిన నేపథ్యంలో బదిలీ చేయడం పలు అనుమానాలకు దారితీస్తున్నాయి ఈ బదిలీలు నామమాత్రంగా జరిగాయా లేదా మండలంలో జరిగిన అక్రమ విషయాలపై జిల్లా అధికారులు గోప్యత పాటిస్తున్నారా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు ప్రభుత్వానికి రావలసిన నిధులు దారిమళ్లించారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి

# బాల్కొండ ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 12:
బాల్కొండ మండల ప్రింట్ మీడియా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల కేంద్రంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో సభ్యులందరూ కలిసి నూతన బాధ్యతలను ఖరారు



చేశారు. నూతన కార్యవర్గ అధ్యక్షులుగా తొగటి మురళీమోహన్, ప్రధాన కార్యదర్శిగా రాజుల రామనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నార్ల రాజు, ఉప అధ్యక్షులుగా కళ్లెం భోజన్న, కోశాధికారిగా షేక్ షాదుల్లాను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మరియు మండల అభివృద్ధి వార్తల ప్రచురణకు బాధ్యతాయుతంగా పనిచేస్తామని తెలిపారు. ఈ నూతన కార్యవర్గం ఒక సంవత్సరం పాటు పదవిలో కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.
ఈ సమావేశంలో ప్రింట్ మీడియా సభ్యులు బ్రహ్మ రౌతు నర్సింగరావు, కటకం శంకర్, వెంకటేష్, షేక్ యూసుఫ్, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి మండలంలోని పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

# వేంపల్లిలో సీసీ డ్రైనేజీ పనులకు శ్రీకారం

## మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం!

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 12:
గ్రామాభివృద్ధిలో భాగంగా నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో నూతన సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా స్థానిక పాలకవర్గం ఈ అడుగులు వేసింది. పారిశుద్ధ్య మెరుగుదలపై ప్రత్యేక దృష్టిగ్రామంలో మురుగు నీరు రోడ్లపై నిలిచిపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన పాలకవర్గం, ముందస్తు చర్యల్లో




భాగంగా ఈ డ్రైనేజీ పనులకు మొదటి ప్రాధాన్యత కల్పించింది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే మురుగు నీరు సక్రమంగా వెళ్లడంతో పాటు, గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడి దోమల వ్యాప్తి, అంటువ్యాధులు తగ్గుతాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి పాలకవర్గం తీసుకుంటున్న చొరవను ప్రజలు అభినందిస్తున్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం సర్పంచ్ మహేష్ యాదవ్ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మహేష్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తమ పాలకవర్గం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గ్రామంలో ఉన్న మిగిలిన సమస్యలను కూడా గుర్తించి, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రముఖులు ఎట్టం మల్లయ్య, సంగెం శేఖర్, ఆరెపల్లి నరేష్, దీపక్, రాణా ప్రతాప్, సుంకరి లక్ష్మి మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంద్రాగస్టు నుంచి ప్రతి ఊరి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సిజెపి దేశవ్యాప్త ప్రచారం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు12 :
15ఆగస్టు నుంచి "క్యా బోల్తీ పబ్లిక్" (ప్రజలు ఏమంటున్నారు, ప్రజల అభిప్రాయం) పేరున కార్యక్రమాలకు కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీపక్ ప్రకటించారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడుల పరిస్థితిని మెరుగు కోసం తల్లిదండ్రులు తమ పిల్లలు చదివే పాఠశాలల్లో సామాజిక ఆడిట్ నిర్వహించాలని, అదేవిధంగా గ్రామ సర్పంచులు స్కూళ్ల మౌలిక సదుపాయాల బాధ్యతను తీసుకోవాలని దీపక్ పిలుపునిచ్చారు. ఈ ఉద్యమానికి శ్రీకారం మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలోని తన సొంత గ్రామం నుంచే ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా దీపక్ ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు. "మనం కొత్త పార్లమెంట్ భవనం, కొత్త ప్రధానమంత్రి ఆవాస్ నిర్మించగలిగాం. కానీ గ్రామాల్లో కొత్త స్కూళ్లను ఎందుకు నిర్మించలేకపోతున్నాం?" అని ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను సూటిగా ప్రశ్నించారు. బడుల అభివృద్ధికి కృషి చేసే సర్పంచులను ప్రోత్సహించేందుకు సీజెపి "సర్పంచ్ ఛాలెంజ్" ను ప్రారంభించనుంది. ఈ ఛాలెంజ్ కింద ప్రతి గ్రామ పాఠశాలలను మెరుగుపరిచే సర్పంచులను బహిరంగ సభల్లో సత్కరిస్తామని పార్టీ తెలిపింది. యావత్ జనం ప్రతి ఊరిలో ఇలాగనే కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.



# డ్రగ్స్ మరియు సైబర్ నేరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు

**బోధన్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ కోసం సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్**

**- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి ప్రజలలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలి**

**- పాత నేరస్థులపై నిఘా పటిష్టము చేయాలి**

**- చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై నిర్విరామంగా దాడులు నిర్వహణ , అవసరం అయితే పి.డి యాక్ట్ నమోదు**

**- డయల్ 112 గురించి ముమ్మరంగా ప్రచారం చేయాలి - రాబోయే పండుగల నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు**








నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 12:
బుధవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బోధన్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి పై నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., సమగ్ర సమీక్ష సమావేశం కోటగిరి పోలీస్ స్టేషన్ యందు నిర్వహించగా బోధన్ డివిజన్ ఏ.సీ.పీ , సర్కిల్ ఇన్స్పెక్టర్లు,ఎస్.హెచ్. ఓ లు ,ఎస్సైలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి సార్ ఆదేశాల మేరకు డ్రగ్స్ మరియు గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని , అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని , ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు , రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బోధన్ డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా హత్య , హత్యాయత్నం , చోరీలు , మహిళలపై నేరాలు , సైబర్ మోసాలు , డ్రగ్స్ మరియు గంజాయి అక్రమ రవాణా , పేకాట , గుట్కా అక్రమ వ్యాపారం వంటి కేసులపై ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని , రౌడీషీటర్లు , పాత నేరస్తులు , బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి , అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని , షీ టీమ్స్ , ఈగల్ టీమ్స్ , చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్ధవంతంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు , బస్టాండ్లు , రైల్వే స్టేషన్లు మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. అలాగే పేకాట , గుట్కా , ఇసుక మరియు ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని , ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్ నిర్వహణ , రికార్డుల నిర్వహణ , స్టేషన్ పరిశుభ్రత మరియు సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి , నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు. చివరిగా శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని , ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని , రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి , సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవే రోడ్డులను కలుపుతూ ఉండేటటువంటి లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం , రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధముగా చూడాలని అన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే మరియు స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని , ఓవర్ స్పీడ్ , త్రిబుల్ డ్రైవింగ్ , మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. డయల్ 112 గురించి ప్రజల వద్దకు చేరే విధంగా అనుక్షణం కృషి చేయాలి. రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని , వాహనాల తనిఖీలు 24/7 తనిఖీలు చేయాలని , వాహనాల తనిఖీలు సమయంలో సిబ్బంది అలసత్వం పనికిరాదని తెలిపారు. ఈ కార్యక్రమం బోధన్ ఏ.సి.పి,పి. శ్రీనివాస్ , సి.సి.ఆర్.బి ఎ.సి.పి గురునాయుడు , సి.సి.ఆర్బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , సీ.ఐ లు మరియు ఎస్హెచ్ఓలు మరియు ఎస్సై , ఐటి కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# కొనసముందర్‌లో ఐకేపీ మహిళా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక..

## సైబర్ మోసాలపై ఎస్సై అవగాహన



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 12:
మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో ద్వాక్రా సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఐకేపీ ఏపీఎం కిరణ్‌కుమార్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని కొనసముందర్ గ్రామంలో గల శివగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఐకేపీ కొనసముందర్ గ్రామ సమాఖ్య మహిళా జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం కిరణ్‌కుమార్, సీసీ అడెల్లి రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామ సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
నూతన కార్యవర్గం వివరాలు:అధ్యక్షురాలు: నస్రిన్ బేగంఉపాధ్యక్షురాలు: గుడిసె లక్ష్మికార్యదర్శి: కట్కాశీ లాస్యకోశాధికారి: పోతనక మేఘనసహాయ కార్యదర్శి: యాట దీపికఈ సందర్భంగా ఏపీఎం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళలు సంఘాల ద్వారా పొదుపు, రుణాలు, వివిధ జీవనోపాధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని కోరారు.
ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమ్మర్‌పల్లి ఎస్సై సీహెచ్ సతీష్ 'మన ఊరు–మన భద్రత' కార్యక్రమంలో భాగంగా మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశకు లోనై మోసపోవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని తెలిపారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, మహిళలు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రజల భద్రత కోసం పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజ్జారపు రాకేష్, ఉపసర్పంచ్ భలే రావు శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీలత, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్, ఐకేపీ సిబ్బంది మరియు ద్వాక్రా సంఘాల అధ్యక్షురాళ్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురికి రూ.70 వేల జరిమానా

## - ఇద్దరికి ఐదు రోజుల జైలు శిక్ష - కమ్మర్‌పల్లి ఎస్సై సిహెచ్. సతీష్

నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 12:
మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురు వాహనదారులకు ఆర్మూర్ ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ కోర్టు భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష విధించినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై సిహెచ్. సతీష్ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి.. నిందితులందరికీ ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.70,000 జరిమానా




విధించారు. వీరిలో కేసు తీవ్రతను బట్టి ఇద్దరు వ్యక్తులకు జరిమానాతో పాటు చెరి ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు రోడ్డుపై వెళ్లే నిరాపరాధుల ప్రాణాలకు ముప్పు తెచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

# ఏర్గట్లలో గంజాయి ముఠా అరెస్ట్:

## ముగ్గురు నిందితుల గుర్తింపు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 12:
ఏర్గట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 240 గ్రాముల




ఎండు గంజాయి, 37 ప్యాకెట్లు, ఒక స్కూటీ మరియు మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గంజాయి విక్రయాలను అరికట్టేందుకు మంగళవారం (ఆగస్టు 11) ఏర్గట్ల పోలీసులు బట్టపూర్ గ్రామ శివారులోని పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో గల బీటీ రోడ్డుపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆ సమయంలో స్కూటీపై అనుమానాస్పదంగా వస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులను నిజామాబాద్‌కు చెందిన శైక్ ఆజం (36), శైక్ ఇర్ఫాన్ (28)లతో పాటు మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన అమోల్ దమ్మపాల్ చౌరే (23)గా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సప్తగిరి కాలనీ--2లో డ్రైనేజీ పనులకు శ్రీకారం

మేడిపల్లి ఆగస్టు 12(ప్రజాకలం న్యూస్)
సప్తగిరి కాలనీ--2లో డ్రైనేజీ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. కాలనీలోని రోడ్ నంబర్--1 నుంచి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ భీమ్లా నాయక్, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్,జనరల్ సెక్రటరీ సుధాకర్ రెడ్డితో పాటు కమిటీ సభ్యులు రాజేష్ నాయక్, వేముల సతీష్, నరేందర్ గౌడ్, సిద్దేశ్వరరెడ్డి, గంగాధర్, సురేందర్ నాయక్,మంచా నాయక్ పాల్గొన్నారు. కాలనీ పెద్దమనుషులు, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, తీరపతిరెడ్డి, బానోత్ పడతీయ, బేతూ వేణు, అశోక్,చారీ, నగేష్,బానోత్ మోహన్ నాయక్ కాలనీవాసులు, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో డ్రైనేజీ పనులతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టి కాలనీని మరింత అభివృద్ధి చేయాలని కోరారు.



## మహంకాళి వైన్ మార్ట్‌తో

# జనం నరకయాతన

### - రద్దీ రహదారిపై మద్యం ప్రియుల హంగామా.. మహిళలు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

### - అధికారులు స్పందించి వైన్ మార్ట్‌ను తరలించాలని స్థానికుల డిమాండ్




**అంబర్‌పేట్, ఆగస్టు 12 (ప్రజాకలం న్యూస్):** అంబర్‌పేట్ ఆలీకేఫ్ చౌరస్తా నుంచి న్యూ దుర్గానగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న శ్రీ మహంకాళి వైన్ మార్ట్ స్థానికులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చే వారు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు.

వైన్ మార్ట్ తెరిచినప్పటి నుంచి మూసివేసే వరకు పరిసరాల్లో మద్యం సేవించే వారి సంచారం ఎక్కువగా ఉంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు రోడ్డు పక్కనే మద్యం సేవించడం, మద్యం మత్తులో అక్కడే పడుకోవడం, వాహనాలను ఇష్టాను సారంగా నిలపడం వంటి చర్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు.

**మహిళలకు తీవ్ర అసౌకర్యం**

ప్రధానంగా మహిళలు, బాలికలు ఈ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. మద్యం సేవించిన కొందరి ప్రవర్తనతో మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారని, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలీకేఫ్ చౌరస్తా నుంచి దుర్గానగర్ వెళ్లే ఈ ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇలాంటి ప్రాంతంలో జనావాసాల మధ్య వైన్ మార్ట్ ఉండటంతో స్థానికులు, పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు.

**అధికారులు స్పందించాలి**

ఈ సమస్యపై పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారిపై వాహనాల పార్కింగ్, మద్యం సేవించే వారి వ్యవహారశైలిపై నిఘా పెట్టడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే వైన్ మార్ట్‌ను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించే అంశాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. ప్రజల భద్రత, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు



మహమ్మద్ హుస్సాముద్దీన్
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబర్పేట్




చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ హుస్సాముద్దీన్ డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను అధికారులు గుర్తించి, వైన్ మార్ట్ కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు.

## ప్రజలకు మరింత మెరుగైన

# ఆరోగ్య సేవలే లక్ష్యం

### - స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్

### జూబ్లీహిల్స్‌లో స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ 4వ వార్షికోత్సవ వేడుకలు




**హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజా కలం ప్రతినిధి)**

జూబ్లీహిల్స్‌లోని స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ 4వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డయాగ్నస్టిక్ హెల్త్‌కేర్ రంగంలో నాలుగేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా, నటుడు డా. మాదాల రవి గౌరవ అతిథిగా, ప్రముఖ నటుడు శ్రీ సాయికుమార్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ వెల్‌నెస్ ఫ్యామిలీ కార్డును ప్రారంభించారు. కుటుంబ ఆరోగ్య సంరక్షణను మరింత సులభతరం చేయడంతో పాటు, నాణ్యమైన డయాగ్నస్టిక్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే దీని లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

ముఖ్య అతిథి శ్రీ నవీన్ యాదవ్ మాట్లాడుతూ: "ఆరోగ్య సంరక్షణలో నాణ్యమైన డయాగ్నస్టిక్ సేవలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ నాలుగేళ్లలో ప్రజల విశ్వాసాన్ని పొందుతూ ముందుకు సాగడం అభినందనీయం. సంస్థ మరింత అభివృద్ధి చెంది, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని కోరుకుంటున్నాను."

ప్రత్యేక అతిథి శ్రీ సాయికుమార్ మాట్లాడుతూ: "ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలి. సమయానికి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యం. స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ నాలుగేళ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది. ప్రజలకు నమ్మకమైన సేవలు అందిస్తూ సంస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాను."

స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. భరత్ రెడ్డి డి. మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక, విశ్వసనీయమైన డయాగ్నస్టిక్ సేవలను అందించడమే మా ప్రధాన లక్ష్యం. ఈ నాలుగేళ్ల ప్రయాణంలో మాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు," అని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య రంగ నిపుణులు, సిబ్బంది, అతిథులు తదితరులు పాల్గొన్నారు.




# మేడిపల్లిలో కనుమరుగవుతున్న పార్కులు

## పార్క్ స్థలాలను కాపాడండి

### హైడ్రాకు ఫిర్యాదు చేసిన బిఎస్పి నాయకులు

**మేడిపల్లి ఆగస్టు 12(ప్రజాకలం న్యూస్)**

మేడ్చల్ మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పోరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిదిలోని మేడిపల్లి 9వ డివిజన్ లో ప్రభుత్వ పార్క్ స్థలాలు కబ్జాకు గురవుతున్నా జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బిఎస్పీ సెక్రెటరీ సుక్క దయానంద్ ఫైర్ అయ్యారు. ఈ మేరకు 9వ డివిజన్ లో పార్క్ స్థలాలను కాపాడాలని కోరుతూ బిఎస్పి పార్టీ జిల్లా నాయకులు మంగళవారం హైడ్రా అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుక్క దయానంద్ మాట్లాడుతూ మేడిపల్లి 9వ డివిజన్ లోని ఈస్ట్ కమలానగర్, పంచవటి కాలనీ, కాకతీయ కాలనీ, ధరణి కాలనీ, సత్యనారాయణపురం రోడ్ నెంబర్ 2, సాయినగర్, సత్యనారాయణపురం రోడ్ నెంబర్ 10,శ్రీనివాస హిల్స్ లో పార్క్ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్న అధికారులకు పట్టింపు లేకపోవడం విస్మయానికి గురి చేస్తుందని వాపోయారు. ఆయా కాలనీలలోని ప్రజలు వాకింగ్ వ్యాయామం చేయడానికి వృద్ధులు సేద తీరడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వదిలిన పార్కులను కొంతమంది అక్రమార్కులు కబ్జాలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్కులలో వినాయక మండపాలు ఏర్పాటు చేసి ప్రజలు సేద తీరడానికి అవకాశం లేకుండా చేస్తున్నారు. పార్కు స్థలాలను పార్కులు గానే ఉంచాలని, కబ్జాలకు గురైన పార్కు స్థలాలను కాపాడాలని హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులను కోరారు.



# బడా బాబుల కన్ను పడిందా?

## కోర్టు స్టే ఉన్న భూమిలో సర్వే ఎందుకు?

### - పట్టాదారులకు నోటీసులు ఇవ్వకుండానే సర్వేకు రెవెన్యూ అధికారులు

### - పోలీసు బలగాలతో రావడంపై భూ యజమానుల అభ్యంతరం

### -సివిల్ వివాదంలో పోలీసుల జోక్యంపై ప్రశ్నలు

### - ఆర్డీఓ అనుమతులు ఉన్నాయా? రికార్డులు పరిశీలించాకే సర్వే చేయాలని విజ్ఞప్తి



**మహేశ్వరం, ఆగస్టు 12 (ప్రజాకలం):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 49, 50 భూముల విషయంలో అధికారుల వ్యవహార శైలిపై పట్టాదారులు అనుమానాలు వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే రెవెన్యూ అధికారులు సర్వేకు రావడం, పోలీసు బలగాలను వెంట తీసుకురావడంపై వారు అభ్యంతరం తెలిపారు.

**నోటీసులు ఇవ్వకుండా సర్వే**

తుమ్మలూరు గ్రామానికి చెందిన పట్టాదారులు ప్రసాద్‌రాజు, సురేష్‌రెడ్డి, రామచంద్రబాబు, హరిబాబులు మీడియాతో మాట్లాడుతూ.. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రెవెన్యూ సిబ్బంది సర్వేకు వచ్చారని తెలిపారు. భూములకు సంబంధించిన రికార్డులు, హక్కులు, హద్దులను పూర్తిగా పరిశీలించిన తర్వాతే సర్వే చేపట్టాలని కోరారు.

**స్టే ఉన్న భూమిలోకి ఎలా?**

సర్వే నంబర్ 55కు సంబంధించి 2023లో హైకోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నాయని పట్టాదారులు పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో సదరు భూమిలోకి రెవెన్యూ సిబ్బంది పోలీసు బలగాలతో కలిసి సర్వేకు రావడం ఏమిటని ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వులను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారా? అనే సందేహాన్ని వ్యక్తం చేశారు.

**పోలీసుల అత్యుత్సాహం ఎందుకు?**

భూమికి సంబంధించిన వ్యవహారం సివిల్ వివాదం కాగా.. సర్వే సమయంలో రెవెన్యూ సిబ్బంది కంటే పోలీసులే అత్యుత్సాహం చూపించారని పట్టాదారులు ఆరోపించారు. భూమి యజమానులు అక్కడ లేని సమయంలోనూ అధికార యంత్రాంగం హడావుడిగా సర్వేకు రావడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.

**ఆర్డీఓ అనుమతులు ఉన్నాయా?**

భూ సర్వేకు మహేకందుకూరు ఆర్డీఓ అనుమతులు ఉన్నాయా? లేక సంబంధిత ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే సర్వేకు వచ్చారా? అని పట్టాదారులు ప్రశ్నించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు రెవెన్యూ, పోలీసు సిబ్బంది నుంచి పొంతనలేని సమాధానాలు వచ్చాయని వారు తెలిపారు.

**15 ఏళ్లుగా మా అనుభవంలోనే..**

సర్వే నంబర్లు 49, 50లోని భూములను గత 15 ఏళ్లుగా తామే అనుభవిస్తున్నామని పట్టాదారులు తెలిపారు. సర్వే నంబర్ 55కు సంబంధించి కుందూరు సంతోష్‌రెడ్డి కూడా తనకు హక్కు ఉందని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో పోలీసు, రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. భూములపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత పత్రాలతో న్యాయపరంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, చట్టపరంగానే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.



**బడా బాబుల కోసమేనా?**

స్థానికంగా భూ సర్వే వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఎంతోమంది రైతులు నెలల తరబడి సర్వే కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పనులు జరగడం లేదని పట్టాదారులు పేర్కొన్నారు. అయితే ఈ భూముల విషయంలో మాత్రం రెవెన్యూ యంత్రాంగం, పోలీసు సిబ్బంది హడావుడిగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో 'బడా బాబుల కన్ను ఈ భూములపై పడిందా?' అనే సందేహం స్థానికంగా వ్యక్తమవుతోందన్నారు. భూ హక్కులను ప్రభావితం చేసేలా ఎలాంటి చర్యలు చేపట్టకుండా, రికార్డులను పూర్తిగా పరిశీలించి నిబంధనల ప్రకారం మాత్రమే సర్వే నిర్వహించాలని పట్టాదారులు రెవెన్యూ అధికారులను కోరారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

## బాధితుడికి రూ. 2.50 లక్షల ఎల్ఓసీ
# అందజేసిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



తానూర్, ఆగస్టు 12(ప్రజా కలం): మండలం దాహగం గ్రామానికి చెందిన చిన్న లక్ష్మణ్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వైద్య సాయం కోసం రూ. 2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈ ఎల్ఓసీ ప్రతిని బాధితుడికి అందజేశారు. సహాయం అందించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావుకు విఠల్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఉత్తమ్ బాలేరావు,నాయకులు సాయినాథ్ ,తదితరులు పాల్గొన్నారు.

# తానూర్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత షూస్ పంపిణీ

తానూర్,ఆగస్టు 12(ప్రజా కలం):మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచితంగా షూస్ పంపిణీ చేశారు, ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాలోడ్ సాయిబాబా నాయకత్వం వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఈ




వసతులను విద్యార్థులందరూ క్రమం తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు, సకాలంలో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూస్ అందజేయడం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహం పెరుగుతుందని, పాఠశాలకు రోజూ క్రమశిక్షణతో రావడానికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు,పాఠశాల రూపురేఖలు మారుతున్నాయని, విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భవిష్యత్తు సెమికండక్టర్లదే...
## పీసీబీ డిజైన్‌లో నైపుణ్యాలు కీలకం



పాలేరు ఆగస్టు 12(ప్రజా కలం న్యూస్ )

పొన్నేకల్ శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & రీసెర్చ్ (అటానమస్)లో "పీసీబీ డిజైన్ హ్యాండ్స్-ఆన్ ట్రైనింగ్" అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్, సెమికండక్టర్ నిపుణులు బానుప్రకాష్ మాట్లాడుతూ భవిష్యత్తు సాంకేతిక రంగం సెమికండక్టర్లపై ఆధారపడి ఉంటుందని, పీసీబీ డిజైన్‌కు కీలక ప్రాధాన్యత ఉందని తెలిపారు. విద్యార్థులకు స్కీమాటిక్ క్రియేషన్, లేఅవుట్ డిజైన్, సిమ్యులేషన్, టెస్టింగ్ అంశాలపై పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పీసీబీ డిజైన్‌లో నైపుణ్యం సాధిస్తే ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు పరిశ్రమలో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. సాయి గీతిక, ఈసీఈ విభాగాధిపతి డా. రాజేష్ తదితరులు విద్యార్థులు నూతన సాంకేతికతలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ డా. సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. సుజాత, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురం ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి
## ఏసీపీకి సీఐటీయూ వినతి సానుకూలంగా స్పందించిన తిరుపతిరెడ్డి

పాలేరు ఆగస్టు 12( ప్రజా కలం న్యూస్ )

ఏదులాపురం మున్సిపాలిటీలోని వరంగల్ ఎక్స్‌రోడ్, నాయుడుపేట జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు షేక్ ఐఖీరుద్దీన్ మాట్లాడుతూ, పెరుగుతున్న వాహనాల రద్దీతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిగ్నల్స్ లేకపోవడంతో ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని, ప్రజల భద్రత కోసం వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏసీపీ తిరుపతిరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, హైఅధికారులు, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కన్నాల ఆంటోనీ, ఏటుకూరి ప్రసాద్, పుల్లయ్య, కుమ్మరికుంట్ల శ్రీను, గోవిందు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

- వెలుగుమట్ల లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం. వేగంగా సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు
- నిర్దిష్ట గడువులోగా పనులు జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి
- వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్.

ఖమ్మం, ఆగస్టు 12(ప్రజా కలం న్యూస్ )

ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ఇండ్ల ఇండ్ల క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, స్లాబ్ పనులు, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి



నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తనిఖీ సందర్భంగా హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచంద్ర, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పారదర్శకంగా 'చేయూత' పింఛన్లు అందించాలి:



- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ ఆగస్టు12 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా, వేగవంతంగా పింఛన్లు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, అర్హతల పరిశీలనతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, వనమహోత్సవం, తెలంగాణ జలనిధి కార్యక్రమాల అమలు పురోగతిపై సమీక్ష నిర్వహించి అధికారులకు కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కొత్త చేయూత పింఛన్ల కోసం ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ దరఖాస్తులను గ్రామ పంచాయితీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల ప్రజలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎక్కడా పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే ప్రారంభించి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా ఇండ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. తెలంగాణ జలనిధి పథకం కింద సోక్ పిట్లు, బోర్‌వెల్స్, ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు గుర్తించిన దుకాణాలను సీజ్ చేయాలని, భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, సుందర్ సింగ్, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యుఎస్ పిసి ఆధ్వర్యంలో ఆళ్లపల్లిలో రెండవ దశ పోరాటం
## - తహసిల్దార్‌కు మెమోరాండం

ఆళ్లపల్లి,ఆగస్టు 12, ప్రజాకలం

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యుఎస్ పి సి ఆధ్వర్యంలో రెండవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా ఆళ్లపల్లి మండల తహసిల్దార్ గద్దం ఉమారాణికి మెమోరాండం అందజేశారు అనంతరం జరిగిన సమావేశంలో టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హతిరామ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ప్రతిరోజు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని హెచ్చరించారు

పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించి 1-07-2023 నుండి అమలు చేయాలి పెండింగ్ బిల్లులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న 6 విడతల డిఏ వెంటనే విడుదల చేయాలి సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ పునరుద్ధరించాలి

27 వేల పాఠశాలల నుండి 4 వేలకు కుదించే ఆలోచనను విరమించుకోవాలి జీఓ యంఎస్ నంబరు- 25 సవరించాలి. ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. 40 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక టీచర్ ఉండాలి ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు వర్క్ ప్రకారం టీచర్ పోస్టులు కేటాయించాలి కేజీబీవి/యుఆర్ఎస్, సమగ్ర శిక్ష, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం బేసిక్ పే అమలు



చేయాలి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతం వెంటనే చెల్లించాలి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చడం సెలవులు, హెల్త్ కార్డులు వర్తింపజేయాలి ఈ ఎచ్ ఎస్ టి పేరుతో వేతనాల నుండి కోత పెడుతున్నా వైద్యం అందడం లేదు. ఈ ఎచ్ ఎస్ టి ని బలోపేతం చేయాలి టెట్‌తో అర్హత ఉన్న ఎస్ జిటి లందరికీ సీనియారిటీ ప్రకారం పి ఎస్ ఎచ్ యం ప్రమోషన్ ఇవ్వాలి

ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు బానోతు బోజ్యా, టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు అగ్గి రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు రామయ్య, రామకృష్ణ, బద్రు, రామ్ చందర్, బావ్ సింగ్, వెంకటేశ్వర్లు, వీరన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ తిమ్మప్ప స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజా కలం ఆగస్టు 12 గద్వాల ప్రతినిధి:

జోగులాంబ గద్వాల జిల్లా ప్రసిద్ధ ఆదిశిలా క్షేత్రమైన మల్డకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ సిబ్బంది సేవలు అందించారు.

ఈ సందర్భంగా కాకతీయ టెక్నో స్కూల్, శివ శివాని స్కూల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సప్త భజనలో ఐదవ రోజు సందర్భంగా పలు గ్రామాల భజన మండలి సభ్యులు హరినామ సంకీర్తనలు ఆలపించారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తి సంద్రంగా మారింది.



# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కు నివాళులర్పించిన కలెక్టర్, ఎమ్మెల్యే లు

ఖమ్మం ఆగస్టు 12(ప్రజా కలం న్యూస్ )విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ మృతదేహానికి పలువురు ఉన్నత అధికారులు, నాయకులు నివాళులర్పించారు.సింగరేణి మండల పరిధిలోని వెంకిటియ తండాలో బుధవారం నవీన్ అంత్యక్రియలు జరిగాయి. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ఎస్ తోపాటు అటవీశాఖ ఉన్నత అధికారులు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్ పలువురు ప్రజాప్రతినిధులు నవీన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని తెలిపారు. నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కలెక్టర్ తో పాటు అధికారులు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. మృతుడు నవీన్ కు భార్య కుమార్తె కుమారుడు, ఉన్నారు.

# చదువుల కోసం 10 కి.మీ. నడక..
## బస్సు కోసం విద్యార్థుల ఎదురుచూపు!



అలంపూర్ ఆగస్టు 12 ప్రజా కలం: అలంపూర్ మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బైరంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సుమారు 10 కిలోమీటర్లు కాలినడకన మండల కేంద్రానికి వచ్చి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సు సౌకర్యం లేక నడవలేక కొంతమంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, మహిళలు కూడా వైద్యం తదితర అవసరాల కోసం మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి బైరంపల్లితో పాటు బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం..
## - బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్న నాయకులు



మరిపెడ,ఆగస్టు12(ప్రజా కలం): మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ పట్టణ బూత్ కమిటీల నిర్మాణ సమావేశాలు బుధవారం నిర్వహించారు.పీసీసీ అబ్జర్వర్ హబీబ్ ఖాన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడుపానుగోతురాంలాల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా 1వ వార్డు కమిటీ అధ్యక్షుడిగా జాటోతు నెహ్రూ,3వ వార్డు కమిటీ అధ్యక్షుడిగా అనంతగిరి శ్రీను,4వ వార్డు కమిటీ అధ్యక్షుడిగా షేక్ యాకుబ్ పాషా,5వ వార్డు కమిటీ అధ్యక్షుడిగా బోడ రవి,6వ వార్డు బోడ రమేష్ నాయక్,7 వ వార్డు బంక ప్రమోద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు బూత్ కమిటీలు కీలకంగా పనిచేయాలని,ప్రతి బూత్‌లో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్ పర్సన్ కాలం సుహీత రవీందర్ రెడ్డి,కౌన్సిలర్లు మేరుగు రాము,జాటోతు సురేష్,తిరుపతి,జియా రమేష్,పానుగోతు రాములు,కోఆప్షన్ సభ్యులు గుండగాని వెంకన్నతో పాటు కాంగ్రెస్ నాయకులు గంధసిరి అంబరీష్,షేక్ తాజోద్దీన్,అలువాల ఉపేందర్ ప్రజాపతి,గంధసిరి విక్రపతి,కరణ్ సింగ్,బోడ రవి,బంక ప్రమోద్,గుంటి రవి,తాడూరి రమేష్, లింగన్న,గంధసిరి సోమన్న,మేరుగు సత్యనారాయణ,బోడ శ్రీను,సాజిద్,తగురు శ్రీను,అనంతగిరి రవి, ఉదయ్ నాగేశ్వరరావు,దేవేందర్,బాల్ సింగ్,లాల్ సింగ్,భాషిత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లుల విడుదల చేయాలని కోరుతూ
# జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం
## ఆగస్టు 17న జిల్లా కలెక్టరేట్ దగ్గర ధర్నా

ఖమ్మం ఆగస్టు 12(ప్రజా కలం న్యూస్ ) పి ఆర్ టి యు టి ఎస్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టి.ఎస్ ని పి ఆర్ టి యు టి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు మరియు వారి బృందం కలిసి పలు అంశాలపై ప్రాతినిధ్యం చేశారు . పిఆర్సి అమలు , సిపిఎస్ రద్దు , పెండింగ్ డి ఎ లు మరియు పెండింగ్ బిల్లులు విడుదల కోరుతు ఆగస్టు 17 న ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కి తెలియచేశారు . జిల్లా విద్యా శాఖకు రెగ్యులర్ డి. ఇ. ఓ. లేకపోవటం వలన ఉపాధ్యాయులకు సర్వీస్ పరమైన విషయాల్లో జాప్యం జరుగుతోందని కావున రెగ్యులర్ డి.ఇ. ఓ. నియామకం కొరకు ప్రాతినిధ్యం చేయటమైనది . ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ను , విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తో మాట్లాడనున్నట్లు తెలియచేశారు . ఇటీవల సస్పెన్షన్ కి గురైన ఖమ్మం అర్బన్ మండల మహిళా ఉపాధ్యాయురాలి రిఇన్స్టేట్ విషయంపై ప్రాతినిధ్యం చేయగా సానుకూలంగా స్పందించి జిల్లా విద్యా శాఖ అధికారికి ఆదేశాలు జారీచేశారు . అనంతరం ఈనెల 17 న ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ దగ్గర ధర్నా చౌక్ లో చేపట్టనున్న ధర్నాకు సంబంధించి ఖమ్మం ఏసీపీ రమణమూర్తి ని కలిసి ధర్నా నిర్వహించడానికి అనుమతి తీసుకున్న జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు . ఈ కార్యక్రమం లో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విజయ్ అమృత్ కుమార్ , టి . రత్న కుమార్ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రెబ్బా శ్రీనివాస్ , జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీరా సోమ్లా , తాళ్లూరి చంద్ర శేఖర్ , లింగం సతీష్ , పత్రికా సబ్ ఎడిటర్ జి.వి.రమణ , వేములపాడు రావు , ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షులు బొడ్డు రవి కిరణ్ , ఖమ్మం టౌన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుసులూరి శ్రీనివాస రావు , ఏ . శాంతా రెడ్డి , తల్లాడ మండల ప్రధాన కార్యదర్శి అద్దంకి గోపాల కృష్ణ , రఘునాథపాలెం మండల బాధ్యులు మాతంగి వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు . జిల్లాలోని రాష్ట్ర, జిల్లా మరియు మండల బాధ్యులు అన్ని మండలాల ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా కృషి చేసి ధర్నా ను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు కోరారు .